
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 20 ఫిబ్రవరి 2025







వేమూరులో ఆలపాటికి మద్దతుగా మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

- సమీపిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికలు
- గుంటూరు జిల్లాలో అత్యధికంగా గ్రాడ్యుయేట్లు
- జోరు పెంచిన కూటమి
- శ్రేణులతో మంత్రులు.. ఎమ్మెల్యేల భేటీలు
- పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా వామ పక్షాలు.. ఉద్యోగ సంఘాలు
- బరిలో 25 మంది అభ్యర్థులు

గుంటూరే.. కీలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ఓటముల్లో గుంటూరు జిల్లా పట్టభద్రుల ఓటర్లు కీలకంగా మారారు. ఈ జిల్లాలోనే అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. అన్ని జిల్లాల కంటే అధికంగా 1,08,109 ఓట్లు గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. చాలా తక్కువగా ఏలూరు జిల్లాలో 16,099 ఓట్లు మాత్రమే ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 63,114 ఓట్లు, ఎన్‌టీఆర్ జిల్లాలో 78,063 ఓట్లు, పల్నాడు జిల్లాలో 57,238 ఓట్లు, బాపట్ల జిల్లాలో 24,493 ఓట్లు ఉన్నాయి. గుంటూరు పట్టణంలోనే అత్యధికంగా ఓట్లు ఉండటంతో ఇక్కడ పట్టు సాధించేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

- కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 27న జరగనుంది. సమయం దగ్గర పడుతుండటడంతో అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గెలుపు కోసం గ్రాడ్యుయేట్‌లతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఓటర్లతో సమావేశాలు నిర్వహించడంతో పాటు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మండల.. పట్టణ స్థాయిలో ఎమ్మెల్యేలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా వామపక్ష పార్టీలు.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు ఇచ్చి లక్ష్మణరావుకు ఓటు వేయాలని కోరుతున్నారు.
- కూటమి అధికారంలో ఉండటంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలకు ఎన్నిక బాధ్యతలను అప్పగించి టీడీపీ అధిష్ఠానం ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియపై సమీక్షిస్తోంది. ఎమ్మెల్సీ బూత్ స్థాయిలో 30 మంది ఓటర్లకు ఒక కార్యకర్త పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు బూత్ స్థాయి కార్యకర్తలు, నేతలతో సమన్వయం చేసుకుంటూ ప్రచార సరళిని గమనిస్తున్నారు. మంత్రులు.. ఎంపీలు కూడా ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలపాటి మద్దతుగా వారు ప్రచారం నిర్వహిస్తున్నారు. భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా కూటమి నేతలు క్షేత్ర స్థాయిలో ఓటర్లను కలుస్తున్నారు. ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికగా ఎమ్మెల్సీ ఎన్నికను స్వీకరించారు. ఆలపాటి భారీ మెజారిటీనే లక్ష్యంగా ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. గెలుపు లాంఛనమే భారీ మెజార్టీనే లక్ష్యమని ఎమ్మెల్యేలు చెబుతున్నారు.
- లక్ష్మణరావుకు బలం ఉద్యోగులు.. ఉపాధ్యాయుల యూనియన్లు. ఇరువురికి పట్టభద్రులతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా ప్రచార హోరు పెంచారు. వామపక్షాలు.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు లక్ష్మణరావు వైపు నిలిచాయి. ఈ ఎన్నికలలో వైసీపీ పోటీలో లేకపోవడంతో ఆ పార్టీ పరోక్షంగా లక్ష్మణరావుకు మద్దతు తెలిపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.



వినుకొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జీవీ, మక్కెన



సత్తెనపల్లి: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్‌సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

167	ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న సహకార సంఘాలు
520	పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య
30	ప్రస్తుతం జీతాలు రాని సహకార సంఘాలు

- జీతాలకోసం ఆరునెలలుగా సొసైటీ ఉద్యోగుల ఎదురు చూపులు
- ఉమ్మడి జిల్లాలోని 30 సహకార సంఘాల్లో ఇదే పరిస్థితి

వడ్డీ వాత జీతం కోత

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విధివిధానాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. వసూలు చేసిన వడ్డీలో 30 శాతం మాత్రమే జీతాలకు వినియోగించుకోవాలన్న నిబంధన ఉద్యోగులకు ప్రతిబంధకంగా మారింది. దానివల్ల ఉమ్మడి జిల్లాలోని చాలామంది ఉద్యోగులు గడచిన ఐదారు నెలలుగా జీతాలు అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని 30 సహకార సంఘాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది. అయినా జిల్లా అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

30 సంఘాల పరిస్థితి మరీ ఘోరం..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 సహకార సంఘాలు ఈ ఏడాది రుణాల వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. దానివల్ల ఆయా సంఘాల్లో పనిచేస్తున్న సుమారు 110 మంది ఉద్యోగుల కు గత ఆరునెలలు గా జీతాలు రావటం లేదని తెలుస్తోంది. ఒక వేళ నిబంధన మీరి జీతాలు తీసుకున్నా దాని బాధ్యత కార్యదర్శి పై పెడుతుండటం తో ఎవరూ సాహసాలు చేయడం లేదు.

చేయూత నిస్తే...

వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు అన్నీ ఒక ప్పుడు మంచి వెలుగు వెలిగినవే. లాభాల బాటలో ఉన్న వాటిని కోరి కష్టాల పాలు చేశారు. ప్రభుత్వం తలచుకుంటే మళ్ళీ పూర్వ స్థితికి తీసుకురావచ్చునని సహకార సంఘాల నేతలు చెబుతున్నారు. రైతులతో ముడిపడిన ఎరువుల అమ్మకాలు వంటివి సొసైటీలకు అప్పగిస్తే ఉద్యోగుల జీతాల కు ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఒక యూరియా బస్తా అమ్మితే రూ. 6.25 లాభం కింద చెల్లిస్తున్నారని అంటున్నారు. యూరియా బస్తా విలువ రూ. 266 అయితే బయట వ్యాపారులు రూ. 350 వరకు విక్రయిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కి వస్తున్న స్టాక్‌లో ఎక్కువ భాగం ప్రయివేటు వ్యాపారులకే వెళ్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఎరువులను సహకార సంఘాల వద్ద నుంచి తీసివేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయాలు జరిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్ళీ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు జరుపుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగించి పూర్తిగా ఎరువులను సహకార సంఘాల కు కేటాయిస్తే ఉద్యోగులు నెల నెలా జీతాలకు ఇబ్బందులు పడకుండా ఉంటారని సహకార ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



30 శాతం నిబంధన ఏమిటంటే..

సహకార సంఘాల ద్వారా మంజూరు చేసే రుణాలకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక సహకార సంఘం నుంచి రూ. కోటి వరకు రైతులకు రుణాలు మంజూరు చేస్తే దానిపై వడ్డీ వస్తుంది. ఆ వడ్డీలో 30 శాతం జీతాలకు , 20 శాతం నిర్వహణకు వినియోగించాలి. వాస్తవానికి రైతులు తీసుకున్న కోటి రూపాయల అప్పును ఒకే సారి చెల్లించే పరిస్థితి ఉండదు.అందులో సగ భాగం మాత్రమే జమ వేస్తారు. అయినా సహకార సంఘం రూ. కోటి కి జిల్లా బ్యాంకుకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితి వల్ల సహకార సంఘా లు ఆర్థిక లేమి వల్ల కునారిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. వడ్డీలో కేవలం 30 శాతం మాత్రమే జీతాలకు వినియోగించాలన్న నిబంధన వల్ల చాలా మంది ఉద్యోగుల కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జగన్‌రెడ్డీ నువ్వేమైనా తేడానా!

- రైతుల కోసమని వెళ్లి నాని, వంశీ, అవినాష్ అందాన్ని వర్ణించటమా!
- జగన్ పర్యటనపై సోమిరెడ్డి ఫైర్

తెనాలి, ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం వస్తున్నానన్నాడు... వారు కష్టాల్లో ఉన్నారని, ఆదుకుంటానంటూ వెళ్లి వారిముందు డాన్సులు వేయటమేంటి? కొడాలి నాని, వల్లభనేని వంశీ, అవినాష్ అందంగా ఉంటారట. ఇదేనా రైతులను ఓదార్చటమంటే? ఒక మగాడు మరో మగాడిని అందంగా ఉన్నారన్నారంటే దీనిపై కొంచెం ఆలోచించాల్సిందే. జగన్ రెడ్డి ఏమైనా తేడానా అనే అనుమానం వస్తుందంటూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఛలోక్తులతో కూడిన విమర్శలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం బుధవారం తెనాలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బుధవారమే మాజీ సీఎం జగన్ గుంటూరులోని యార్డుకు రైతుల పరామర్శ కోసం వచ్చిన సంగతి తెలిసిందే. అక్కడ ఆయన చేసిన పర్యటన తీరుపై సోమిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. నీ తల్లి, చెల్లి పుట్టుక గురించి మాట్లాడిన వారిని కూడా పరామర్శించి వచ్చావంటే అంత కన్నా నీచం మరోటి ఉండదన్నారు. దేశంలో రైతు సగటు తలసరి అప్పు రూ. 74,500 అయితే, మన రాష్ట్రంలో రూ. 2.45 లక్షలు. ఇదీ ఆయన సాధించిన ప్రగతి అని, ఇంతటి కీర్తి సాధించిన ఆయనా రైతుల గురించి మాట్లాడేది అంటూ విమర్శించారు. మిర్చి మద్దతు ధర క్వింటాకు రూ. 7వేలు నిర్ణయిస్తూ గతంలో నువ్వే జీఓ ఇచ్చావు. జీఓఎంఎస్ నంబర్ 28 నువ్విచ్చిందే.. ఒక్కసారి చూసుకో జగన్‌రెడ్డీ అంటూ గుర్తుచేశారు. సూక్ష్మ, తుంపర సేద్యం వంటివి పూర్తిగా ఎత్తేసి, వాటి పంపిణీలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న మా ప్రభుత్వాన్ని ఏమని విమర్శిస్తావని ప్రశ్నించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

సాగునీరు పారుదల లేక.. పూడిక, కంప చెట్లు, తూటి కాడతో సాగునీటి కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో కాల్వలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్ని కలు నిర్వహించింది. ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. ఇక సాగునీటి రంగానికి మహర్దశేనని రైతులు భావించారు. అయితే రోజులు గడుస్తున్నా.. పర్యవేక్షణకు సాగునీటి సంఘాలున్నా.. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు అందుబాటులో ఉన్నా.. కాల్వల మరమ్మ తుల ఊసే అధికారులు మరిచారు. సాగు నీటి సంఘాలు బాధ్యతలు చేపట్టినా కాల్వల నిర్వహణలో మార్పు రాకపోవడంపై రైతులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో గత ఏడాది జల వనరుల శాఖ టెండర్లు నిర్వహించగా వాటిని అధికార పార్టీ నేతలు బలవంతంగా రద్దు చేశారు. అయితే ఇంతవరకు మళ్లీ ఆ టెండర్లు నిర్వహించడం.. మరమ్మతులు చేపట్టడం గురించి అధికారులు పట్టించుకోవడంలేదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధి కారు లు మర మ్మ తులను పక్కన పెట్టేశార న్న విమర్శలు వస్తున్నాయి.

- మరమ్మతులకు నోచుకోని కాల్వలు
- నాడు టెండర్లు రద్దు.. నేడు మిన్నకున్నారు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- సాగర్ పరిధిలో మాచర్ల డివిజన్‌లో మాత్రమే పూర్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జునసాగర్ పరిధిలో సాగునీటి కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కాల్వల బాగు గురించే పట్టించుకునే వారే లేకుండా పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా.. గత ప్రభుత్వంలోని పరిస్థితులే ఇంకా కొనసాగుతున్నాయి. నాడు వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వక మిన్నకుంటే నేడు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసినా పనులు జరగకుండా అధికార పార్టీ నేతలు కొందరు అడ్డుకున్నారన్న విమర్శలున్నాయి. కాల్వల బాగుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా టెండర్లు నిర్వహించి పనులు చేపట్టడంతో జల వనరులశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాగర్ పరిధిలోని సాగునీటి కాల్వల మరమ్మతులకు జలవనరుల శాఖ గత ఏడాది టెండర్లను డివిజన్ల వారీగా నిర్వహించింది. పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో ఒప్పందాలు కూడా జరిగాయి. అయితే అనుయాయులకు ఆయా పనులు దక్కకపోవడంతో అధికార పార్టీ నేతలు కొందరు బలవంతంగా వాటిని రద్దు చేయించారు. కొందరు నేతలు పనులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. తమకు చెందిన వ్యక్తుల పేరుపై టెండర్లు దాఖలు చేయించి పనులు చేసుకోవాలన్న ప్రయత్నాల్లో భాగమే టెండర్లు రద్దు అన్న విమర్శలున్నాయి. తిరిగి టెండర్లు నిర్వహించి పనులు చేపట్టే అంశంలో అలసత్వం తాండవిస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిడితో టెండర్లను రద్దు చేసిన అధికారులు వాటి గురించి పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి.



గోవిందాపురం మైనర్ కాల్వలో పెరిగిన కంప చెట్లు

రూ.18.22 కోట్లు విడుదల

సాగర్ కుడి కాల్వ పరిధిలోని సాగునీటి కాల్వల మరమ్మతులకు గత ఐదేళ్లు నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. ఈ పరిస్థితుల్లో రైతుల గోడు అర్థం చేసుకున్న కాల్వల బాగుపై కూటమి ప్రభుత్వం స్పందించింది. అధ్వాన కాల్వల మరమ్మతులకు రూ.18.22 కోట్లు విడుదల చేసింది. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 305 పనులను గుర్తించారు. కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించారు. అత్యవసర పనులు తక్షణం చేపట్టాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది. అయితే నిధుల కేటాయింపుతో కాల్వలు బాగుపడతాయన్న రైతు ల ఆశ అడియాసగానే మిగిలింది. చివరి భూ ములకు నీరందించే లక్ష్యంతో రైతుల ప్రయోజ నాలకు పెద్దపీట వేస్తూ కాల్వ మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఆ పార్టీ నేతలే పనులను నిలిపివేయించడం గమనార్హం. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో రూ.4.69 కోట్లతో చేపట్టిన 101 పనులను పూర్తి చేశారు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు 3.65 కోట్లతో పనులు చేపట్టారు. ఓఅండ్ఎం డివిజన్ పరిధిలోని లింగంగుంట్లలో 77 పనులకు రూ.4.21 కోట్లు, సత్తెనపల్లిలో 62 పనులకు రూ.3.89 కోట్లు, వినుకొండలో 34 పనులకు రూ.1.78 కోట్లతో అంచనా వేయగా వాటికి టెండర్లు నిర్వహించాలి. సత్తెన పల్లిలో రూ.58.04 లక్షలతో 16 పనులు చేపట్టారు.



చిలకలూరిపేట మేజర్ కాల్వలో పెరిగిన కంప



అవయవాలను తరలిస్తున్న సిబ్బంది

మరణిస్తూ.. మరొకరికి జీవితం

- విజయవాడ మహిళ అవయవదానం
- ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- కుటుంబ సభ్యుల అనుమతితో అవయవదానం
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



ఎం.సరస్వతి (ఫైల్)

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయ పడిన మహిళ మరణిస్తూ మరి కొందరికి జీవితానిచ్చారు. విజయవాడ భవానీపురానికి చెందిన ముత్యాల సరస్వతి (54) ఈ నెల 14వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం మం గళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులపాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించిన వైద్యులు, మంగళవారం సరస్వతి బ్రెయిన్ స్టెమ్ డెడ్‌కు గురైనట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియపర్చి, అవయవదానం పై అవగాహన కల్పించారు. సరస్వతి కుటుంబ సభ్యులు, బంధువులు అవయవదానం చేసేందుకు అంగీకరించడంతో బుధవారం సాయంత్రం ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు సరస్వతి కు టుంబ సభ్యులు ముందుకు రావడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. దాత శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు నేత్రాలను సేకరించి మణిపాల్, ఎయిమ్స్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రులకు పంపుతున్నట్టు తెలిపారు. అవయవదాతల త్యాగాన్ని గౌరవిస్తూ దాతల అంత్యక్రి యలను ప్రభుత్వ లాంఛనాలతో చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతెమ్ శాంతా సింగ్, గుంటూరు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, ఎయిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

రిసెప్షన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారులు తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు, మెటీరియల్‌ని రిసెప్షన్ కేంద్రాలు వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు స్ట్రాంగ్ రూంలో సక్రమంగా భద్రపరచాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరి యల్ భద్రపరిచే స్ట్రాంగ్ రూం వద్ద రిసెప్షన్ కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరచటానికి ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర పోలింగ్ మెటీరియల్ రిసెప్షన్ కేంద్రానికి తీసుకువస్తారన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ మెటీరియల్, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లు, ఇతర సామగ్రి తీసుకోవటానికి, తీసుకున్న వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరచటానికి పోలింగ్ బూత్‌లు వారీగా ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇతర జిల్లాల రిసెప్షన్ కేంద్రాల నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్ తీసుకోవటానికి, జిల్లాకు ఒక టీంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బ్యాలె ట్ పేపర్ అకౌంట్, పీవో డిక్లరేషన్, డైరీ, పేపర్ సీల్ అకౌంట్ ఫారాల్లోకి ప్రతి కాలమ్‌ను పరిశీలించి తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి తీసుకున్న మెటీరియల్ ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూం టీంలతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ బూత్‌లు వారీగా స్ట్రాంగ్ రూంకు తరలించాలన్నారు. అనంతరం రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామగ్రి తీసుకునే అధికారులు పరిశీలించాల్సిన ఫారాలు, వాటి వివరాలను మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. జేసీ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డీటీసీ కె సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

టిడ్కోల్లో.. జీవనోపాధి కేంద్రాలు

- తొలిగా మంగళగిరి, చిలకలూరిపేటలో...
- రూ. 17.8 కోట్లను సమకూర్చనున్న సీఆర్‌డీఏ, ఉడా

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశం నడిచి వెళ్లే దూరంలోనే ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం కింద టిడ్కో భవన సముదాయాల వద్ద జీవనోపాధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో తొలి దశలో మంగళగిరిలోని వీ.పురం-1, చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం-1, 2టిడ్కో భవన సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వాటిల్లో అన్ని రకాల దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా టిడ్కో ఫ్లాట్లలో నివాసం ఉంటున్న వారికి స్థానికంగానే ఉపాధి కల్పించడం వీటి లక్ష్యంగా మునిసిపల్ పరిపాలన శాఖ చెబుతున్నది. జీ+3 భవనాలను నిర్మించి వాటిల్లో దుకాణాలను ఏర్పరుస్తారు. ఈ ప్రాజెక్టుని స్థానిక పట్టణాభివృద్ధి సంస్థలతో కలిసి ఏపీ టిడ్కో అమలు చేస్తుంది. వృత్తి నైపుణ్యం, మార్కెటింగ్ మద్దతు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌ని మెప్మా పర్యవేక్షిస్తుంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంగళగిరి లోని వీ.పురం-1, చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం-1, 2లో ఇప్పటికే లబ్ధిదారులు నివసిస్తున్నారు. వీ.పురం-1లో 1,728 కుటుంబాలు, పురుషోత్తంపట్నంలో 5,520 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. దీని దృష్ట్యా వీ.పురం-1లో 35 షాపులను నిర్మించాలని నిర్ణయించారు. 2025 ఫిబ్రవరి - జూన్ మధ్యన 20 దుకాణాలను రూ. 2.4 కోట్లు, జూలై - నవంబరు మధ్యన మరో 15 దుకాణాలను రూ. 1.8 కోట్లతో నిర్మిస్తారు. దీనికి సీఆర్‌డీఏ నిధులు సమకూర్చాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. పురుషోత్తంపట్నం-1, 2లో తొలి విడతలో 30 దుకాణాలను రూ. 3.6 కోట్లు, రెండో విడతలో 80 దుకాణాలను రూ. 9.6 కోట్లతో స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తుంది.

టిడ్కో జీవనోపాధి కేంద్రాలను కేటాయించేందుకు ఔత్సాహిక లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దరఖాస్తులను పరిశీలన చేసి సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. ఆయా షాపులు కాస్టు-టూ-కాస్టు ప్రాతిపదికన స్వయం సహాయక బృందంలో 2 నుంచి ఐదుగురు సభ్యులకు కేటాయిస్తారు. ప్రతీ చదరపు అడుగుకు రూ. 2 వేల వరకు ధర నిర్ణయిస్తారు. షాపుల ఆపరేషన్, నిర్వహణ ఎస్‌హెచ్‌జీలే చూసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకుల నుంచి ఆర్థికసాయం కూడా ఇప్పిస్తారు. ఉత్పాదక కేంద్రాలు, గార్మెంట్ యూనిట్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వంటివి ఏర్పాటుకు అనుమతిస్తారు.

అరాచకశక్తులను ప్రోత్సహిస్తున్న జగన్

● పోలీసులపై జగన్ అనుచిత వ్యాఖ్యలను ఖండించిన జీవీ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి దుర్మార్గులను సంఘవిద్రోహ శక్తులను ప్రోత్సహించడంతో పాటు పోలీసులపై బాధ్యతారాహిత్యంగా, అవహేళనగా మాట్లాడటాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా విజయాన్ని ఆకాంక్షిస్తూ పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఉద్యోగులతో పాటు పోలీసులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిజాయితీగా పనిచేసిన అధికారులను అవమానించడంతో పాటు ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి అస్తవ్యస్తమైన పాలన సాగించారన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల గౌరవాన్ని పెంచడంతో పాటు ఉద్యోగులకు సముచిత స్థానం కల్పించి గౌరవించడం జరుగుతుందన్నారు. జగన్ వ్యవహార శైలిని గమనించిన ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని, అప్పుడే ప్రజలు మీ బట్టలు ఊడదీశారన్న సంగతి జగన్ గుర్తుంచుకోవాలన్నారు. వంశీ ఒక్క మంచిపనైనా చేశాడా అని నిలదీశారు. ఇక పద్ధతి మార్చుకో.. పగటి కలలు కనొద్దు.. ఇప్పటికైనా మారాలంటూ జగన్‌కు హితవు పలికారు. మిమ్మల్ని నమ్మిన విశాల్ గున్ని, ఆంజనేయులు నటి జత్వానీ కేసులో జైలుకు వెళ్లాల్సివచ్చిందని, ట్రిపుల్ ఆర్‌ను ఇబ్బందిపెట్టిన వారంతా నేడు జైలుబాట పడుతున్నారని, దుర్మార్గులకు శిక్ష పడటం ఖాయమని చెప్పారు. పోలీస్ వ్యవస్థను మెచ్చుకుంటున్నారని, ఎక్కడైనా గుట్కాలు, గంజాయిలు కనిపిస్తున్నాయా అని అన్నారు.

జగన్ రాష్ట్రాన్ని విడిచి వెళ్ళటం ఖాయం

● ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలుచేయగానే జగన్ రాష్ట్రాన్ని విడిచి వెళ్ళటం ఖాయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని సాతులూరులో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లతో పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వ ఎనిమిది నెలల పని తీరుకు ప్రామాణికమనే వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. బలంగా ఉన్న ప్రజాప్రభుత్వాన్ని బలహీనపరిచేందుకు జగన్‌తో పాటు ఆయన అవినీతి మీడియా అసత్యాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. అధికారులను బెదిరిస్తూ వారిని అగౌరవపరిచేలా మాట్లాడిన జగన్ వ్యాఖ్యలు చేతగానితనానికి నిదర్శనం అన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాదును మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన నాయకులు మార్కెండేయులు, తోట రాజారమేష్ పాల్గొన్నారు.

ఏఐతో రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రీకారం

● పట్టభద్రులు బాధ్యతతో ఓటు వేసి ఆలపాటిని గెలిపించాలి ● మంత్రి పార్థసారథి

కొల్లూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌తో రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ఏర్పాటుచేసిన పట్టభద్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత ఐదేళ్లలో జగన్మోహనరెడ్డి అరాచకాలు, అకృత్యాలు అనుభవించిన రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో ఛీకొట్టినా ఆయన ఆలోచన మారలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాలనచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కొడాలి నాని, వల్లభనేని వంశీలతో జగన్ సిగ్గుమాలిన రాజకీయాలు చేయడం తలవంపులు తెస్తున్నదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి ఉద్యోగులు, పట్టభద్రులు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అథోగతిలోకి నెట్టినా సీఎం చంద్రబాబు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని అందరూ ఐక్యతతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, ఆలపాటి గెలుపు ఏకపక్షంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వ్యవస్థలను గాడినపెడుతూ అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. సమావేశంలో ముస్లిం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తక్ అహ్మద్, వంగా సాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, బీజేపీ నాయకుడు మందా జనార్ధన్, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శరత్‌చంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బొల్లాకు వ్యతిరేకంగా
సజ్జలను కలిసిన అసమ్మతి నేతలు



బొల్లాకు వ్యతిరేకంగా సజ్జల రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వినుకొండ వైసీపీ నేతలు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వినుకొండ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని వైసీపీ అసమ్మతి నేతలు తాడేపల్లి ప్యాలెస్‌లో సజ్జల రామకృష్ణారెడ్డిని బుధవారం కలిసి ఫిర్యాదుచేశారు. బొల్లా వ్యవహారశైలిపై వారంతా సజ్జల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన నోటిదూల కారణంగా వినుకొండలో పార్టీ మనుగడ కోల్పోతోందని, స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొత్త ఇన్‌చార్జిని నియమించాలంటూ సజ్జలను కోరారు. మిమ్మల్నే కాదు.. మమ్మల్ని కూడా బొల్లా తిడతారని ఆయన గురించి అసమ్మతి నేతలకు సజ్జల వివరించినట్లు సమాచారం. త్వరలో క్షేత్రస్థాయిలో నివేదికల ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇక నుంచి చుండూరి వెంకటేశ్వర్లు నాయకత్వంలో మేమంతా కలిసికట్టుగా పనిచేస్తామని బొల్లా నాయకత్వంలో పనిచేయబోమని తెగేసి చెప్పినట్లు వివరించారు. సజ్జలను కలిసిన వారిలో జడ్పీ కోఆప్షన్ మెంబరు గూండాల స్వెనోమ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, నూజెండ్ల మండల వైసీపీ అధ్యక్షుడు నక్కా నాగిరెడ్డి, ఈపూరుకు చెందిన వైసీపీ నాయకులు హనుమయ్య, బుచ్చయ్య, అవినాష్‌రెడ్డి, నరాలశెట్టి శ్రీనివాసరావు, ఇమామ్‌సా, కొత్త కృష్ణారెడ్డి, మరో వందమంది కార్యకర్తలు ఉన్నారు.

కిడ్నాప్.. హత్యాయత్నం కేసులో నలుగురు నిందితుల అరెస్టు

● పరారీలో మరొకరు



కిడ్నాప్ కేసులో నిందితుల వివరాలను తెలుపుతున్న సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు తదితరులు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీతం డబ్బులిస్తానంటూ కిడ్నాప్ చేసి దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసును పోలీసులు చేధించారు. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచి వివరాలను సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన జానా సతీష్ హైదరాబాద్‌లో తెనాలిలోని నందులపేటకు చెందిన అన్నే మణిదీప్‌కు చెందిన ఓ కార్యాలయంలో ఆఫీస్‌బాయ్‌గా చేరాడు. జీతం చెల్లింపులో జాప్యం జరగడంతో యజమాని మణిదీప్‌ను పలుమార్లు సతీష్ ప్రశ్నించాడు. తన జీతం తనకు ఇవ్వాలంటూ పట్టుబట్టడంతో ఈ నెల 14న తెనాలి వస్తే జీతం డబ్బు ఇస్తానని మణిదీప్, సతీష్‌కి చెప్పాడు. దీనితో సతీష్ తన స్నేహితుడు ధరణికోట ప్రశాంత్ అలియాస్ పండుతో తెనాలి వచ్చాడు. వారి ఇరువురిని మణిదీప్ అతని మిత్రులు ఉప్పు రంగారావు, పెనుమూరి ఆదాం, కోట ప్రేమ్‌చందు, బచ్చల రమేష్‌బాబులు ఐదుగురు కలసి బలవంతంగా కారులో ఎక్కించుకొని సుల్తానాబాద్‌లోని ఒక గదిలో బంధించారు. అనంతరం వారిపై విచక్షణారహితంగా దాడి చేసి కరెంటు షాక్‌కు గురిచేశారు. అనంతరం సతీష్, ప్రశాంత్‌లను శివారు ప్రాంతాల్లో చంపేందుకు కారులో తీసుకొని వెళుతుండగా వారి నుంచి తప్పించుకున్న సతీష్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం నందివెలుగు వద్ద నిందితుల్లో నలుగురిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

బుల్లెట్ బ్యాక్‌ఫైర్ అవటంతో ఆర్మీ జవాన్ మృతి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఫీల్డ్‌ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా బుల్లెట్ బ్యాక్ ఫైర్ అవటంతో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం పంచాయతీ పరిధిలోని గౌడపాలెం గ్రామానికి చెందిన పరిశా వెంకటేష్(26) మృతి చెందారు. ఢిల్లీ ఆర్‌ఆర్ హాస్పటల్ నుంచి పార్థివదేహాన్ని హెలీకాప్టర్‌లో స్వగ్రామానికి తీసుకొస్తారని సమాచారం. పరిశా శ్రీనివాసరావు, శివపార్వతి దంపతుల పెద్దకుమారుడైన వెంకటేష్‌కు 2022లో వివాహమైంది. అతనికి భార్య పరిశా గాయత్రి, కుమార్తె జోత్స్న ఉన్నారు. రాజస్థాన్‌లో ఫీల్డ్‌ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా బుల్లెట్ బ్యాక్ ఫైర్ కావటంతో వెంకటేష్ మృతి చెందాడు.

పోలీసుల అదుపులో కిడ్నాప్ కేసు నిందితుడు?

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అప్పు అడిగితే ఇవ్వలేదని బలవంతంగా కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి కారులోనే కుళ్లబొడిచి కొట్టి పడవేసిన ఘటనలో నిందితుడు వైసీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్‌బేగ్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. ఈ నెల 5వ తేదీన సాయంత్రం వార్ఫ్ రోడ్డులో కోతమిషన్ వద్ద నిలబడి ఉన్న కార్పెంటర్ షేక్ మస్తాన్‌వలిని నెంబర్ ప్లేట్ లేని కారులో వైసీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్, మరో ముగ్గురు వచ్చి బలవంతంగా ఎక్కించుకొని తక్కెళ్లపాడు, అక్కడ నుండి విజయవాడ దారి పొడవునా కొట్టుకుంటూ తీసికువెళ్లారు. మస్తాన్‌వలిని చంపుతామని బెదిరించారు. ఇబ్రహీంపట్నం తీసుకెళ్లి అక్కడ నుంచి తెనాలి తీసుకొచ్చి కౌన్సిలర్ ఇంటి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడి అరెస్టుపై పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

గుంటూరు మీదుగా దానాపూర్‌కు
9 ప్రత్యేక రైలు సర్వీసులు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా తొమ్మిదిరోజుల పాటు గుంటూరు మీదుగా దానాపూర్‌కు తొమ్మిది ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07791 చర్లపల్లి - దానాపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిత్యం ఉదయం 9.30కి బయలుదేరి మధ్యాహ్నం 12.18కి పిడుగురాళ్ల, 2గంటలకు గుంటూరుకు చేరుకొంటుంది. అనంతరం విజయవాడ-విజయనగరం మార్గంలో ప్రయాణించి రెండో రోజు అర్ధరాత్రి దాటాక 1.30కి దానాపూర్ చేరుతుందన్నారు. నంబరు 07792 దానాపూర్-చర్లపల్లి స్పెషల్ రైలు ఈ నెల 20వ తేదీ నుంచి 28 వరకు నిత్యం వేకువజామున 4.45కి బయలుదేరి మధ్యాహ్నం 2.50కి గుంటూరు, సాయంత్రం 4.18కి పిడుగురాళ్ల, రాత్రి 9.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

జిందాల్ ప్లాంటును సందర్శించిన ఐజీ రవికృష్ణ బృందం

● పట్టుబడిన 4 టన్నుల గంజాయిని ఈ నెల 22న దహనం చేయనున్నట్లు వెల్లడి



జిందాల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంవీ చారితో సమావేశమైన ఐజీ రవికృష్ణ, పోలీసు ఉన్నతాధికారుల బృందం

యడ్లపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంటును ఐజీ రవికృష్ణ ఆధ్వర్యంలోని పోలీసు ఉన్నతాధికారుల బృందం బుధవారం సందర్శించింది. ప్లాంటు కార్యనిర్వాహక అధ్యక్షుడు (ఆపరేషన్స్) ఎంవీ చారితో బృందం సమావేశమైంది. ఇటీవల కృష్ణాజిల్లాలో పట్టుబడిన సుమారు 4 టన్నుల గంజాయిని దహనం చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయిని ఈ నెల 22న తగులబెట్టేందుకు నిర్ణయించామని, అందుకు ప్లాంటులో తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. అనంతరం ప్లాంటులోని అన్ని విభాగాలను పరిశీలించారు. వ్యర్థాల సేకరణ, వాటిని దహనం చేసి విద్యుదుత్పత్తి చేస్తున్న తీరును తెలుసుకున్నారు. ఐజీ వెంట ఎన్టీఆర్ కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్, ఈగిల్ ఎస్పీ కె.నగేష్ బాబు, గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, పెనమలూరు సీఐ వెంకటరమణ, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

కోల్డ్ స్టోరేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు
తడికమళ్ల కన్నుమూత



తడికమళ్ల సూర్య ప్రకాశరావు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తడికమళ్ల సూర్యప్రకాశరావు బుధవారం కన్నుమూశారు. గత ముప్పై సంవత్సరాలుగా ఆయన గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫెడరేషన్ ఆఫ్ కోల్డ్ స్టోరేజ్ వైస్ ప్రెసిడెంట్‌గా, గుంటూరు చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్‌ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. రైతులకు అందుబాటులో ఉండే ప్రాంతం లో కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించి, వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించటం లో సూర్యప్రకాశరావు ఎప్పుడూ ముందుండేవారని అసోసియేషన్ కార్యదర్శి పి.సురేంద్రబాబు అన్నారు. ఆయన లేనిలోటు పూడ్చలేనిదని అసోసియేషన్ కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సూర్యప్రకాశరావు అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్టు వారు వెల్లడించారు.

ఐకమత్యానికి కళలు దోహదం

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఐకమత్యాన్ని, చైతన్యాన్ని కళలు ఎప్పుడూ ఆకాంక్షిస్తాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని నృత్య విభాగం ఆధ్వర్యంలో బుధవారం లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ హాజరయ్యారు. కళల్లో ప్రత్యేకమైనవి నాట్యమన్నారు. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా అందరూ నాట్యశాస్త్రాన్ని అధ్యయనం చేసి సమున్నత వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న పీజీ ప్రవేశాల డైరెక్టర్, విద్యావిభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ నాట్యశాస్త్రం నేటి అధునాతన సైన్స్ వంటిదని, ఈ శాస్త్రాన్ని మరింత ప్రాచుర్యంలోకి తేవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రధానవక్తగా డాక్టర్ కె.దేవేంద్రపిళ్లై మాట్లాడుతూ సబీర్‌గా మొదట ఆరంభమైన ఈ నాట్యం క్రమక్రమంగా భరతనాట్యంగా పరిణతి చెందిందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నాట్యశాస్త్ర వికాసం, నృత్య, నాట్య మూలభేదాన్ని, వివిధ నాట్య సంప్రదాయాల్ని, నాట్యశాస్త్ర అంశాలను, కాలానుగుణంగా వస్తున్న మార్పులను వివరించారు. వివిధ రాజుల పాలనలో నాట్యం స్థితిగతులను సాహిత్య, చారిత్రక విశేషాలతో మేళవించి ప్రదర్శన పూర్వకంగా ప్రసంగించారు. నాట్యంవలన కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను తెలిపారు. నేటి యువత ఉత్సాహంగా ఈ కోర్సును అభ్యసించాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి విభాగ పురోగతిని వివరించారు. కార్యక్రమంలో విభాగం అతిథి అధ్యాపకులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

1,42,943 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,47,414 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,42,943 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 75,790 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13700
నంబరు. 5	10000	14000
273	10200	13000
341	10000	14000
4884	10000	12200
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13900
బ్యాడిగి	10000	13500
దేవనూరుడీలక్స్	10000	13300
తాలుకాయలు	4000	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి : డీఈఓ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం లోని స్టాల్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు పని చేయాలని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం ఆహార పదార్థాలను పరిశీలించారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం : వేములకొండ

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, పట్టభద్రులకు ఇచ్చిన అన్ని హామీలు కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. గుంటూరులోని నెహ్రూనగర్, బుచ్చయ్యతోటలోని విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు మంగళవారం కరపత్రాలు పంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి 16,347 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్య ఓటుతో ఆలపాటిని గెలిపించి కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మేకపోతుల సోమశేఖర్, పాటిబండ్ల బలరాం, అరవపల్లి శ్రీనివాసరావు, రమేశ్ పాల్గొన్నారు.

ఇమామ్‌లకు గౌరవ వేతన చెల్లింపు హర్షణీయం

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజానులకు కూటమి ప్రభుత్వం రూ.45 కోట్లు గౌరవవేతనం విడుదల చేయటం హర్షణీయమని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ షేక్ చిన్న బాజీ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని, వారికి ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. కార్యక్రమంలో కేఎంఈ హుస్సేన్, షేక్ ఫిరోజ్, షేక్ బాజీ మాస్టర్, పాటిబండ్ల బలరాం, కార్తీక్ పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లచెరువు, ఎత్తురోడ్డు మొహిద్దిన్‌పాలెం దర్గాలో బుధవారం నుంచి శనివారం వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సయ్యద్ షా సులేమాన్ షాహ్ ఖాదిరి అల్ జిలాని తెలిపారు. దర్గా ఆవరణలో ఉరుసు పోస్టర్లను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా 20న చందనోత్సవం, 21న అన్నదానం, దీపారాధన, 22న ఖతమే షరీఫ్ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

పోరాటయోధుడు శివాజీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హిందువులపై, ఆలయాలపై దాడి చేసిన వారిపై పోరాడిన యోధుడు ఛత్రపతి శివాజీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు కొనియాడారు. ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక కొరిటెపాడు పార్క్‌లో ఆయన విగ్రహానికి వారు నివాళులర్పించి ప్రసంగించారు. స్థానిక కార్పొరేటర్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మరాఠ్ సంఘ్ కార్యదర్శి జాజమ్ సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, కావే రామయ్య, శ్రీనివాసరావు, తనజీ, బాబర్ విఠోబా, దుర్యోధన్ పాటిల్, రామచంద్ర పాటిల్, మోతే శేషగిరిరావు, కే. ధర్మనారాయణ్ సింగ్, చిరుమామిళ్ల గోపికృష్ణ, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

బస్సుల కండిషన్‌లో ఎటువంటి నిర్లక్ష్యం వద్దు

● డిప్యూటీ సీఎంఈ సత్యనారాయణ

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకులకు కండిషన్‌లో ఉన్న బస్సులను అందించటంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని జోన్-3 డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.సత్యనారాయణ సూచించారు. తనిఖీల్లో భాగంగా డిప్యూటీ సీఎంఈతో పాటు గుంటూరు-1 డిపో మేనేజర్ ఎంవీఎస్ రామకృష్ణలు డిపోలో షెడ్యూల్ 3, 4 అయిన బస్సుల కండీషన్, స్టీరింగ్ కండిషన్, ఎలక్ట్రికల్ వైరింగ్, బ్యాటరీ కండీషన్, డ్రైవర్, ప్యాసెంజర్ సీట్ల కండీషన్‌లను పరిశీలించారు. డిపో మెకానికల్ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

రోస్టర్‌లో తప్పులు సరిచేసిన తరువాతే పరీక్షలు నిర్వహించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రోస్టర్ విధానంలో తప్పులు సరిచేసిన తరువాతే గ్రూపు-2 ప్రధాన పరీక్షను నిర్వహించాలని, అప్పటి వరకు పరీక్షను నిలుపుదల చేయాలని ఏపీ నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కే.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలో గ్రూపు 2 అభ్యర్థులు చేపట్టిన నిరసనల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 92,250 మంది అభ్యర్థులు అర్హత సాధించారని అన్నారు. కానీ రిజర్వేషన్లు, ఇతర విభాగాల్లో ఉండే వారిని రోస్టర్‌లో చోటు కల్పించారని, దీంతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘ నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్ కేటాయించండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్ కేటాయించాలని అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవి చంద్రశేకరరావు అన్నారు. ఈ మేరకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్‌కు వినతి పత్రం అందజేశారు. కోటా మాల్యాద్రి, కరిముల్లా, నాగరాజు ఉన్నారు.

ఆలపాటికే పట్టభద్రుల మద్దతు

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కే పట్టభద్రుల మద్దతు ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్యా స్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాధవి మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమల్లో ఉన్న ప్రైవేటు స్కూళ్ల ఉపాధ్యాయులు తమ ప్రథమ ప్రాధాన్య ఓటును ఆల పాటికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, జెట్టి బాబు, కన్నా మాస్టారు, మేకల రవీంద్రబాబు, పెండ్యాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన ఆలపాటి

రైతుల పేరు ఉచ్చరించే అర్హత జగన్ రెడ్డికి లేదు : గల్లా మాధవి

రైతుల మోటార్లకు ఉరితాళ్లలా మీటర్లు బిగించినంచిన జగన్మోహన్‌రెడ్డికి రైతుల పేరు ను ఉచ్చరించే అర్హత లేదని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు మిర్చి యార్డులో రైతుల పరామర్శ పేరుతో జగన్మోహన్ రెడ్డి పర్యటించడాన్ని ఆమె ఖండించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జగన్మోహన్‌రెడ్డి చేసిన తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసి రైతుల పేరుతో రాజకీయం చేయాలనుకునే నీచపు ఆలోచనలు చూసి రైతులు అసహ్యం చుకుంటున్నారన్నారు.

విజ్ఞాన్స్, బౌలింగ్ గ్రీన్‌స్టేట్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, యూఎస్ఏ, ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీల(బీజీఎస్‌యూ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూఎస్ఏ ఓహియోలోని బౌలింగ్ గ్రీన్‌స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ ఇంటెరిమ్ వైస్ ప్రోవోస్ట్ ప్రొఫెసర్ రామ్ వీరపనేని, ఆర్కిటెక్చర్ అండ్ అప్లైడ్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ వేల్ మోక్తర్‌తో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. దీని ద్వారా విద్య బోధన, పరిశోధన తదితర రంగాల్లో ఇరు సంస్థల పరస్పర సహకారం అందించుకుంటాయి. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సీజీఎస్టీ ఉద్యోగులకు పతకాలు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సౌత్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీలలో సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు సత్తా చాటారు. నాలుగు బంగారు, రెండు రజిత పతకాలు సాధించి గుంటూరు కమిషనరేట్‌కు ఖ్యాతి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కన్నావారితోట జీఎస్టీ భవన్‌లో పతకాలు తెచ్చిన ఉద్యోగులకు బుధవారం సన్మానం నిర్వహించారు. సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ సూపరింటెండెంట్ పి.వెంకటాచలం లాన్ టెన్నిస్ లో 40 ప్లస్ సింగిల్స్, 40 ప్లస్ డబుల్స్, 50 ప్లస్ డబుల్స్ లో మూడు బంగారు పతకాలు గెలుచుకున్నారన్నారు. ట్యాక్స్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు 100 మీటర్ల పరుగు పందెం 50 ప్లస్ కేటగిరిలో గోల్డ్ మెడల్ సాధించగా, ట్యాక్స్ అసిస్టెంట్ అనిత కు షాట్ పుట్, డిస్కస్ త్రో ఈవెంట్లలో రెండు రజిత పతకాలు దక్కించుకోవటం స్ఫూర్తిదాయకమని అభినందించారు. కార్యక్రమంలో సీజీఎస్టి అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, ఏసీలు వి.వెంకటేశ్వరరావు, ఎం.నాగరాజు, బి రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చిదేళ్ల ఈశ్వరరావు, ప్రకాష్ బాబు తదితరులున్నారు.

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనుల నిర్లక్ష్యంపై కమిషనర్ కొరడా

● ఇద్దరు సస్పెన్షన్, నలుగురికి షోకాజ్ నోటీసు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనులకు వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసినప్పటికీ అంతర్గతంగా పనులు జరుగుతుండటం, కేటాయించిన విధుల్లో పర్యవేక్షణ లోపంపై స్థానిక వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి చదలవాడ జగన్మోహనరావు, టీపీబీవో నిఖిల్ వంశీలను విధులను సస్పెండ్ చేశారు. అదేవిధంగా టిపిఎస్ సత్యనారాయణ, ఏసిపి రెహమాన్, డీసీపీ సూరజ్, సిటి ప్లానర్ల రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్ర జ్యోతి): నగరపాలక సంస్థ తాగునీటి రిజర్వా యర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయా లని, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా రెడ్డిపాలెం రిజర్వాయర్, వెహికిల్ షెడ్, సంజీవయ్యనగర్ రోడ్ విస్తరణ పనులు, నవభారత్ నగర్, జేకేసీ నగర్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కమిషనర్ మాట్లాడుతూ సంజీవయ్య నగర్ గేటు నుంచి రెడ్డిపాలెం రోడ్డు వరకు చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. జెకెసి నగర్, నవభారత్ నగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు జరిగే సమయంలోనే నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, కళ్యాణరావు, సతీష్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఏఈలు, టిపిఎస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ తరుపున అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్సోర్సింగ్ కార్మికులు జూటూరి వెంకటేశ్వరరావు, బంగారు సింహాద్రి ల కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్ లను బుధవారం కమిషనర్ ఛాంబర్ నందు అందించారు.

రాష్ట్రంలో ఓబీసీ జనగణనను వెంటనే చేపట్టాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం యూత్‌అధ్యక్షుడు క్రాంతికుమార్

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓబీసీల జనగణనను తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం బాపట్ల జిల్లా యూత్ అధ్యక్షుడిగా పచ్చపట్ల గంగరాజును నియమిస్తూ బుధవారం నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను చైతన్యం చేసి, వారి హక్కుల సాధన కోసం కృషి చేయడానికి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంత రావు, రేపల్లె నియోజకవర్గం యువజన అధ్యక్షులు కొనిక వెంకట్రావు, గాలి రాజు, రాకేష్, వంశీ తదితరులున్నారు.

బహుజన ప్రజ్ఞశాలి 'ఉసా'

● డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బహుజన మేధావి, ప్రత్యామ్నాయ రాజకీయ సిద్ధాంత ప్రతిపాదకులు (ఉసా) ఉప్పుమావులూరి సాంబశివరావు జయంతి కార్యక్ర మాన్ని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు అధ్యక్షతన స్థానిక అరండల్‌పేట నందు గల అమరావతి బుక్‌హౌస్‌లో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఉసా గొప్ప సామాజిక ఉద్యమకారుడని బహుజన ప్రజ్ఞశాలని ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. బహుజన మహాసభ అధ్య క్షుడు జీఆర్ భగత్ సింగ్, ఏపీ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, బత్తుల విల్సన్, జూపూడి శ్రీనివాసరావు, వేల్పూరి నరసింహారావు, విప్పర్ల ముత్తయ్య, అనిల్‌బాబు, నల్లపు నీలాంబరం, గంగోలు శామ్యూల్, మల్లాది నాగేశ్వరరావు, పెద్దప్రోలు శ్రీమన్నారాయణ, రవీంద్ర తదితరులు ప్రసంగించారు.

విద్యార్థులు విద్యతోపాటు కళలు, క్రీడల్లో రాణించాలి

గుంటూరు (విద్య)ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర వికాసానికి విద్యతో పాటు కళలు, సాహిత్యం, క్రీడలపై ఆసక్తి తప్పనిసరిగా కనపరచాలని ప్రముఖ చలనచిత్ర రంగస్థల నటులు, రచయిత, దర్శకులు గాయకుడు, డాక్టర్ ఎంఎస్ చౌదరి అన్నారు. హిందూ కళాశాల 90వ వార్షికోత్సవం సందర్భంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రంజిత్ ట్రోఫీ క్రికెట్ కెప్టెన్ షేక్ రఫీ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదగటానికి గుంటూరు పౌరుడిగా గర్విస్తున్నానని తెలియజేశారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, కళాశాల పాలనా కోఆర్డినేటర్ కె.కాళిదాస్, ఐక్యూ ఏసీ డాక్టర్ పి వేణుగోపాల్, ప్రోగ్రాం కన్వీనర్ పివి రాము, డాక్టర్ ఎస్ వి ఎస్ గిరిజ, మాధవ్ పెద్ది మాధవి, డాక్టర్ ఏ బాలశౌరి, అరుణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హిందూ సంఘటనే దేశానికి శ్రీరామరక్ష

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందువు లంతా ఐకమత్యంగా ఉండటం ద్వారానే దేశంలో సుస్థిరత అన్ని రకాల సమస్యలకు పరి ష్కారమని హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజక్ కోడూరి జయరాం తెలిపారు. హిందు చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి సందర్భంగా స్థానిక హిందూ కళాశాల మైదానంలో బహిరంగ సభ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటే శ్వర్లు మాట్లాడుతూ హిందువులకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతర ం స్థానిక హిందు కళాశాల కూడలి నుంచి కొరిటెపాడు శివాజీ పార్కులోని శివాజీ విగ్రహం వరకు వందలాది బైక్‌లతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికా ర ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, హిందూ చైతన్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి, వీరయ్యచౌదరి, రామ్మోహన్‌రావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ స్థాపనలో బల్వంత్ రాయ్ మెహతా కృషి కీలకం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ స్థాపనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు బల్వంత్ రాయ్ మెహతా కృషి కీలకమైనదని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని రాష్ట్ర పంచాయతీ పరిషత్ క్యాంపు కార్యాలయంలో బల్వంత్ రాయ్ మెహతా జయంతి నిర్వహించారు.

లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలి : గేయానంద్

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్సీ , జన విజ్ఞాన రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్ లలో పర్యటించి ఓట్లను అభ్యర్థించా.రు ఆయన మాట్లాడుతూ శాసనమండలిలో ప్రశ్నించే వ్యక్తులు ఉండాలని వారిని విధిగా గెలిపించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జాన్‌బాబు, ట్రెజరర్ వెంకట్రావు మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు కుమార్, సలీం, టిఆర్ రమేష్, సుబ్బారాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను పోలీసులకు అందజేసిన కిమ్స్ హాస్పిటల్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా గుంటూరు కాకాని రోడ్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ యాజమాన్యం ఎనిమిది సీసీ కెమెరాల సర్వైలెన్సును బుధవారం పాతగుంటూరు పోలీసులకు అందజేసింది. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని, కిమ్స్ శిఖర రీజనల్ సీఓఓ సుధాకర్ జాదవులు పాతగుంటూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య, ఎస్సైలు ఎన్‌సి ప్రసాద్, ఎస్‌కే అబ్దుల్ రెహమాన్లకు అందజేశారు. ఈ సందర్భంగా అద్విక్ మాట్లాడుతూ మల్టీస్పెషాల్టీ కేర్ హాస్పిటల్‌గా సేవలందిస్తున్న కిమ్స్ శిఖర హాస్పిటల్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.


మనస్థాపంతో యువతి ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా కాలనీ 3వ లైనుకు చెందిన కొలవకూరి శైలజ (25) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో టిన్నర్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె వివాహం 2020 సంవత్సరంలో నెల్లూరుకు చెందిన వెంకట సుబ్బరాజుతో జరిగింది. కుటుంబ కలహాల కారణంగా పెళ్లయిన మూడు నెలలకే భర్త నుంచి విడిపోయి తల్లి దండ్రుల వద్ద నివాసం ఉంటోంది. భార్యాభర్తల విడాకులకు సంబంధించి కోర్టు నందు వాయిదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శైలజకు వేరే వ్యక్తితో పరిచయమై తనని వివా హం చేసుకోవాలని అనుకుంది. కానీ విడాకులు రావడం ఆలస్యం అవుతుందని భావించి బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో టిన్నర్ పోసుకొని తనకు తాను నిప్పంటించుకుని మృతి చెందింది. మృతురాలు తండ్రి కొలవకూరి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

స్థానిక అరండల్‌పేటస్టేషన్ పరిధిలోని కాకుమాని తోట 5వ లైన్ డొంక రోడ్డుకు చెం దిన వండాన అశోక్‌కుమార్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. అశోక్ కుమార్‌కు చెందిన ఏపీ 40 సీసీ 9696 సుజుకి యాక్సెస్ స్కూటీని ఈ నెల 13న రాత్రి సుమారు 7 గంటల సమయంలో అరండల్‌పేట 2వ లైన్‌లో గల విజయ్ డిజిటల్ షాపు దగ్గరకు వచ్చి రోడ్డు పక్కన పార్కింగ్ చేసి షాపుకు వెళ్లి కొంతసేపటికి షాపు నుంచి బయటకు వచ్చి చూడగా స్కూటీ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రుణ మేళా



మహిళలకు రుణాలు పంపిణీ చేస్తున్న రాజేష్ తదితరులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో బుధవారం రుణ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ ఎ.రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణంలోని 150 మహిళా సంఘాలకు రూ.5 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్, ముద్ర, పీఎంఈ జీపీ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు రుణాలను అందజేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని లక్షాధికారులు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు యూనియన్ బ్యాంకు ఎప్పుడూ ముందు ంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట చీఫ్ మేనేజర్ కోటేశ్వరరావు, మెప్మా సీఈఓలు థామస్, సరోజిని, రవి తదితరులు పాల్గొన్నారు.

అరండల్‌పేట శివాలయాన్ని సందర్శించిన మంత్రి వాసంశెట్టి

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పురాతన అరండల్‌పేట శివాలయాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ సందర్శించారు. శివ మాలలో ఉన్న ఆయన బుధవారం రాత్రి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శివాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కనపర్తి శ్రీనివాసరావు, బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆశీర్వచనాలు అందుకొంటున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

రైతుల గురించి జగన్‌కు మాట్లాడే అర్హత ఉందా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తన ఐదేళ్ల పాలనలో రైతులను నిండా ముం చిన జగన్‌కు అన్నదాతల గురించి మాట్లాడే అర్హత ఉందా అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా రైతుల ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేయడమా అన్నదాతలను ఆదుకోవడం అంటే అని జగన్‌ను నిల దీశారు. పొలాలకు సరిహద్దు రాళ్ళు, రైతుల పాస్ పుస్తకాలపై బొమ్మలు వేయించుకున్న మాత్రాన రైతులను ఆదుకోవడం అవుతుందా అని ఎద్దేవా చేశారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లేదని గగ్గోలు పెడుతున్న జగన్, తన ఐదేళ్ల కాలంలో ఏనాడైనా రైతుల గురిం చి ఆలోచించారా అని ప్రశ్నించారు. పట్టిసీమ ప్రాజెక్టును ఐదేళ్లలో నిర్వీర్యం చేసి పంట పొలాలకు నీళ్ల కూడా లేకుండా చేశారని విమర్శించారు. మిర్చి రైతులను మొదటి నుంచీ ఆదుకుంది తెలుగుదేశం పార్టీ అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసం జగన్ అగచాట్లు : మోహనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై ఏమాత్రం అవగాహన లేని జగన్మోహన్‌రెడ్డి తన రాజకీయ లబ్ధికోసం అనేక అగచాట్లు పడుతున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. రైతుల్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు, ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రౌడీలు, దొంగ లను తీసుకెళ్లి రైతు పరామర్శ పేరుతో గుంటూరు మిర్చియార్డులో జగన్‌రెడ్డి డ్రామాలు ఆడారని మండిపడ్డారు. యార్డులో వైసీపీ పిల్ల సైకోలు రౌడీల్లా ప్రవర్తించి రైతులు అమ్ముకునేందుకు తీసుకొచ్చిన మిర్చి బస్తాలను సైతం దోచుకోవడం దారుణమన్నారు. రైతులకు చెందిన మిర్చి బస్తాలను దోచుకున్న వారి వివరాలు త్వరలోనే బయటకు వస్తా యని వారికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

రైతు సమస్యలపై కనీస అవగాహన లేని జగన్

● మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ ఎద్దేవా

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మిర్చి యార్డును సందర్శించింది రైతు ప్రయోజనాల కోసమా... రాజకీయ ప్రయోజనాల కోసమా అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ప్రశ్నించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ రైతు సమస్యలపై ఏమాత్రం అవగాహన లేని జగన్‌రెడ్డి మిర్చి రైతులను చూసి మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాల గురించి సంజాయిషీ ఇచ్చిన తరువాత సందర్శించి ఉంటే బాగుండేదన్నారు. మార్చి 8వ తేదీ వరకు కోడ్ అమలులో ఉన్నప్పటికి ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేస్తూ మిర్చి యార్డులోకి ప్రవేశించారన్నారు. రైతుల్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి, ప్రభుత్వంపై బురద జల్లడానికి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదరణ-3 పథకాన్ని మళ్ళీ తెస్తున్న సీఎంకు ధన్యవాదాలు

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఆదరణ-3 పథకాన్ని పునరుద్ధరిస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీసీ సమాజం తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దఫా ఈ పథకం ద్వారా వృత్తిదారులకు మరింత మేలు జరిగేలా రూపొందించి, నిర్దిష్ట ప్రణాళిక ద్వారా పకడ్బందీగా అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు, గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపుల్లో 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ నెల 19న అపస్మారక స్థితిలో గుంటూరు రైల్వే స్టేషన్ దగ్గర పడి ఉండగా అక్కడివారు జీజీహెచ్‌లో చేర్పించగా చనిపోయినట్లుగా డాక్టర్ ధ్రువీకరించారు.

జగన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అధికారుల బట్టలను విప్పదీసి కొడతాం అంటూ వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాడువాయి రామకృష్ణ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలో ఓ హోటల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను శాసనసభలో మాట్లాడాల్సింది పోయి నేరస్తులను జైలులో కలిసి అధికారులను కొడతామనడం దుర్మార్గమని అన్నారు.

పేదలకు.. ఆరోగ్య రక్ష

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య ధీమాను కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మార్గదర్శకాల ప్రకారం అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం ఈ కార్డు ద్వారా అందనుంది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందించే కార్యక్రమానికి గతేడాదే కేంద్రం శ్రీకారం చుట్టింది. కానీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. అర్ధాంతరంగా అప్పుడు నిలిచిపోయిన దశ నుంచి తాజాగా వైద్యఆరోగ్యశాఖ మొదలుపెట్టింది. దీనిలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం అందేలా చూడడంతో పాటు గతంలో ఈకేవైసీ పూర్తికాని వారి ఇళ్లకు యంత్రాంగం వెళ్లి అది పూర్తయ్యేలా చూస్తోంది. ఏఎన్ఎంలు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన డేటాను గతంలోనే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి పంపి ఉంది. అందులో జిల్లాల వారీగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి కుటుంబాల వివరాలు నమోదు చేసి ఉండడంతో ఏఎన్ఎంలు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రక్రియను ఓ కొలిక్కి తెచ్చే పనిలో నిమగ్నమయి ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 80 శాతం నమోదు పూర్తవడంతో పాటు లబ్ధిదారుల జాబితా కూడా తయారయిందని, త్వరలోనే వీరందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

- ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్రం పథకం
- కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 7 లక్షల కుటుంబాలకు మేలు
- బాపట్ల జిల్లాలోనే 2.25 లక్షల మంది ఆయుష్మాన్ గొడుగు కిందకి
- గతేడాది ఎన్నికలకు ముందు అర్ధాంతరంగా ఆగిన ప్రక్రియ
- ప్రస్తుతం ఓ కొలిక్కి.... త్వరలోనే కార్డుల జారీ





(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ పథకం ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 7 లక్షల నిరుపేద కుటుంబాలకు మేలు జరగనుంది. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఈ సంఖ్య 2.25 లక్షల మందిగా ఉంది. లబ్ధి పొందనున్న కుటుంబాల సంఖ్య ఇలా ఉంటే సభ్యులు పరంగా చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే దాదాపు పది లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. కొత్తగా లబ్ధిదారుల నమోదు ప్రక్రియతో పాటు గతంలో ఈకేవైసీ చేయించుకోని వారిపై కూడా యంత్రాంగం దృష్టి పెట్టి ఇంటింటికీ తిరిగి దానిని పూర్తి చేయిస్తున్నారు

5 లక్షల వరకు వైద్యం ఉచితంగా...

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా హెల్త్ కార్డు అందుకున్న కుటుంబానికి 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందనుంది. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న హాస్పిటల్స్ అన్నీ ఈ పథకానికి కూడా సేవలందించనున్నాయి. బీపీఎల్ పరిధిలో లేకపోయినా 70 ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులేనని ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. దీని ద్వారా మరింత మంది లబ్ధిదారుల జాబితాలో చేరుతున్నారు. కేంద్రం నుంచి వచ్చిన జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు సర్వే చేపడతారు. ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయడం, తర్వాత దశలో ఈకేవైసీ, ఫీల్డ్ లెవెల్ సర్వే తర్వాత కార్డుల జారీ చేపట్టనున్నారు. ఈ కార్డుల జారీకి సంబంధించి చాలా వరకు ప్రక్రియ గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందే పూర్తయింది. కానీ ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో అది అర్ధాంతరంగా నిలిచిపోయింది. కేంద్రం తాజాగా ఆ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలలో మార్పులు చేయడంతో లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. లబ్ధిదారులకు కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం త్వరలోనే వీటిని పేద కుటుంబాలకు అందించనుంది

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కూడా శాపం

పేదలకు ఆరోగ్య రక్ష ఇవ్వడం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం అందించడంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. లబ్ధిదారుల డేటా మొత్తాన్ని కేంద్రమే పంపినా తర్వాత ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు కార్డులు అందించడంలో వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. గతేడాది ఎన్నికలకు ముందే ఈ కార్డుల పంపిణీకి సంబంధించిన ప్రక్రియను కేంద్రం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కానీ ఈ కార్డులను ఎన్నికలకు ముందే నిరుపేదలకు అందితే రాజకీయంగా నష్టం జరుగుతుందనే భావనతో మొత్తం ప్రక్రియ పై నే గత ప్ర భుత్వం శీత కన్ను వేసింది. నమోదు పూర్తి చేసుకున్న వారు ఈకేవైసీ చేయించుకోవడంలో వైసీపీ మోకాలడ్డింది. పైగా క్షేత్రస్థాయిలో ఈ పథకం మీద అవగాహన కల్పించడంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శించింది. గతేడాదే ఈ పథకానికి సంబంధించి హెల్త్ కార్డులను పెద్దఎత్తున కేంద్రం జారీ చేసింది. కానీ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అంతా కలిపి వెయ్యి కార్డులలోపే గతేడాది ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పేదలు అందుకున్నారు. గత పాలకులు ఈ పథకం విషయంలో కూడా మోసపూరితంగా ఆలోచించడం వల్ల దాదాపు ఏడాది పాటు నిరుపేదలు ఉచితంగా అందే వైద్య సేవలకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రక్రియ అంతా ఓ కొలిక్కి రావడంతో త్వరలోనే కార్డుల జారీని చేపట్టడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

రేపు చికెన్, ఎగ్ మేళా

◆ బర్డ్ ఫ్లూపై ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కార్యాచరణ
◆ కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు ఈ నెల 21(శుక్రవారం) గుంటూరులో చికెన్, ఎగ్ మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టర్ పశుసంవర్ధక శాఖ, ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ వినియోగంపై ప్రజల్లో ఉన్న ఆందోళనలు, అపోహలు తొలగించేలా పశుసంవర్ధక శాఖ, పౌల్ట్రీ ఫార్మర్స్ సమన్వయంతో అవగాహన కల్పించాలని అన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ కట్టడికి ముందస్తుగా ప్రభుత్వం సూచించిన బయో సెఫ్టీ ప్రోటోకాల్స్‌ను పౌల్ట్రీ ఫారమ్స్‌లో ఖచ్చితంగా అమలు జరిగేలా పశుసంవర్ధక శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ పరిస్థితులను పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఓ నరసింహారావు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని పౌల్ట్రీ ఫామ్స్‌లో బర్డ్ ఫ్లూకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదని, కోళ్ళకు బర్డ్ ఫ్లూ సోకకుండా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఫౌల్ట్రీ ఫారమ్స్‌లో బయో సెఫ్టీ ప్రోటోకాల్స్ అమలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ సోకిన ప్రాంతాలలో కిలోమీటరు పరిధిలోని పౌల్ట్రీ ఫారమ్స్‌లోని కోళ్ళను పూర్తిగా నాశనం చేయటంతో పాటు, పది కిలోమీటర్ల పరిధిలోని పౌల్ట్రీ ఫారమ్స్‌లోని కోళ్ళ రవాణాను పూర్తిగా నిలిపి వేశారన్నారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రచారం వలన చికెన్, కోడిగుడ్లు వినియోగం గణనీయంగా పడిపోయిందని తెలిపారు. చికెన్, కోడి గుడ్లు పూర్తిగా ఉడికించటం వలన వైరస్‌లు నాశనం అవుతాయని, వాటిని తినటం వలన ఎటువంటి వైరస్ సోకవని సురక్షితమని వైద్యులు నిర్ధారించారన్నారు. సమావేశంలో ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ చైర్మన్ వై సురేష్, సభ్యులు నాగేశ్వరరావు, కే గిరిధర్, కిషోర్, వెంకయ్య, రాంబాబు, కిరణ్, జాకీర్ పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మితో సమావేశం అయిన జిల్లాలోని పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

శోభాయాత్రలో ఘర్షణ, లాఠీచార్జి

దాచేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఘర్షణకు దారి తీసింది. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను దాచేపల్లిలోని కారంపూడి రోడ్డు నుంచి ప్రారంభించారు. ఈ శోభాయాత్ర దాచేపల్లి ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ లైబ్రరీ సెంటర్‌కు చేరింది. లైబ్రరీ సెంటర్‌లో కొంతమంది ఆకతాయిలు శోభాయాత్రపై రాళ్ళు రువ్వారు. దీంతో శోభాయాత్రలో పాల్గొన్న యువకులు కూడా ఆకతాయిలపై తిరిగి రాళ్ళు రువ్వారు. పరస్పర రాళ్ళ దాడులతో దాచేపల్లిలోని లైబ్రరీ సెంటర్ రణరంగంగా మారింది. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం కేకలు, అరుపులతో ఉద్రిక్తంగా మారటంతో సామాన్య ప్రజలు పరుగులు తీశారు. దుకాణాల యజమానులు షాపులు మూసి పరుగులు తీశారు. ఈ సంఘటనతో పోలీసులు లాఠీచార్జ్ నిర్వహించారు. గుంపులు గుంపులుగా ఉన్న స్థానికులను పోలీసులు చెల్లాచెదురు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కరరావు, ఎస్ఐలు శివ నాగరాజు, సౌదర్ రాజన్, పాపారావులు 50 మంది పోలీసులతో లైబ్రరీ సెంటర్‌కు చేరుకున్నారు. కనుచూపు మేరలో ఎవ్వరూ లేకుండా తరిమి వేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయి బందోబస్తును ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో అనుకోని సంఘటన జరగటంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు జరిగిన సంఘటనపై అధికారుల నుంచి సమాచారం తెలుసుకుని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.



దాచేపల్లి లైబ్రరీ సెంటర్‌లో ఇరు వర్గాలను చెదర గొడుతున్న పోలీసులు

'గ్రీన్‌గ్రేస్'పై అంబటి చెప్పేవన్నీ అవాస్తవాలు

భజరంగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి మురళి ఎలా ఓనర్ అయ్యాడో చెప్పే ధైర్యం ఉందా...!

సవాల్ విసిరిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణంపై అంబటి మురళి అన్నీ అవాస్తవాలు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. బుధవారం గుంటూరులోని తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ..... ఆదిత్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇచ్చిన రైల్వే ఎన్‌వోసీ రద్దు చేసిన సంగతి గుర్తుందా అంబటి మురళి అని ప్రశ్నించారు. ప్రాజెక్టు ఓనర్ అయిన అంబటి మురళి రాజకీయ అధికార మదంతో నేడు అసలు ఓనర్లను సైతం బెదిరించి స్వాధీనం చేసుకున్నారు. ఆదిత్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరు మార్పు చేసుకున్నప్పుడు ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకున్నారా.... నాడు అధికారంలో ఉన్నామనే అహంకారంతో ఏదైనా చేయొచ్చు.. ఏదైనా కట్టొచ్చు అనే మితిమీరి వ్యవహరించారు అని అన్నారు. రూ.కోట్ల విలువైన భూమి అంబటి మురళి సొంతం కాదు,అయిన ఎక్కువ భాగం ఎలా సొంతం చేసుకున్నాడో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

వైసీపీ అధికారంలో ఉండగా మునిసిపల్ అధికారులను, పొల్యూషన్ అధికారులను, రైల్వే అధికారులును సైతం బెదిరించిన సంఘటనలు మరచిపోయావా అని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వున్నదని నాపై అసత్య ఆరోపణలు చేయడం అంబటికి పరిపాటిగా మారిందన్నారు. మునిసిపాలిటీ కార్యాలయంలో కావాల్సిన అన్ని పేపర్లు నీకు అనుకూలంగా ఎలా తెచ్చుకుంటున్నావు... మునిసిపల్ అధికారులు పనులు నిర్వహించవద్దని నోటీసులు జారీచేసినా గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ పనులు పూర్తి చేశారు, గృహప్రవేశం చేయడం కూడా జరిగింది అని నరేంద్ర అన్నారు. అంబటి మురళి డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు సహకారంతోనే మునిసిపల్ కార్యాలయంలో పనులు చేయించుకుంటున్నారని నరేంద్ర ఆరోపించారు. రేరా సంస్థలో ఉన్న చందు సాంబశివరావు, కామేశ్వరరావు అనే ఇరువురిని అడ్డుపెట్టుకుని నిబంధనల ఉల్లంఘన చేసిన ఘటన అంబటి మురళికి గుర్తు లేదా అని విరుచుకుపడ్డారు. సంఘం డెయిరీ విషయంలో కాని తన కుటుంబంపై చేసిన ఆరోపణలు విషయంలో గాని ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు. అంబటి రాంబాబును అడ్డుపెట్టుకుని గ్రీన్ గ్రేస్ నుంచి షాడో ఎమ్మెల్యేగా చేసిన దోపిడీ తీరుపై మాత్రమే ఎన్నికల సమయంలో మాట్లాడటం జరిగిందని, ఏపీ ప్రభుత్వానికి తక్షణమే ఒక ఉత్తరం రాసి విచారణ జరిపించాలని కోరే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు.



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

రైతులకు కష్టం వస్తే ఐదేళ్లు పట్టించుకోలేదు

జగన్మోహన్‌రెడ్డి గుంటూరు మార్కెట్ యార్డు వద్దకు వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడి వెళ్లిపోయాడు.. రైతులకు కష్టం వస్తే 5సం. లు పట్టించుకోకుండా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే నరేంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల బాగోగుల దృష్ట్యా ఎన్నో పథకాలపై దృష్టి సారించారన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఎన్నికలు నిబంధనలు పట్టవు, ఆయన ఇంకా అధికారంలోనే ఉన్నట్లు ఫీల్ అవుతున్నాడనీ, జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా లేకపోయినా స్వేచ్ఛగా తిరుగు తున్నాడన్నారు. గతంలో ప్రతిపక్ష పార్టీలు బయటకు వస్తే అక్రమ అరెస్టులు చేసిన సంగతి మరచిపోయారా అని ఈ సందర్భంగా నరేంద అన్నారు.

ఆక్వా రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు

ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగంలో అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. ఏఎన్‌యూలో జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. డెవలప్మెంట్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్మెంట్ అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను ఉపయోగించి సాగు వినియోగాన్ని వివరించారు. సులువుగా సాగు చేసే పద్ధతులను సాంకేతికంగా అభివృద్ధి చేసేలా కొత్త మెలకువలు పెంపొందించుకోవాలని సూచించారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వీ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ టెక్నాలజీతో కూడిన సెన్సార్ వినియోగంతో ఆక్వా సాగు చేయవచ్చునన్నారు. సదస్సుకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన ఆచార్య వీవీ కృష్ణ మాట్లాడుతూ ఆక్వా కల్చర్ గొప్పతనాన్ని తద్వారా చేపలు, రొయ్యలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే పోషక విలువల గురించి తెలియజేశారు. పాలకమండలి సభ్యులు ఆచార్య కే సుమంత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు నదీ తీర ప్రాంతం ఎక్కువగా ఉందని అందులో సాగు చేపట్టినట్లయితే జీడీపీ పెంచుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఆచార్య యం.జగదీష్ నాయక్ ఆక్వా కల్చర్ సాగులో సస్టైనబుల్ ప్రాక్టీస్‌ను వివరించారు. ఈ సదస్సు లో ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే వీరయ్య, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య ఎం. శ్రీనివాసులు రెడ్డి, ఆచార్య వీ లోకనాథ, ఆచార్య పీ పద్మావతి అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

జాతీయ సమైక్యత శిబిరంలో ఏఎన్యూ విద్యార్థుల ప్రతిభ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ కనబరిచారు. ఈనెల 3వ తేదీ నుంచి 9 వరకు నరసాపురంలోని వైఎన్ కళాశాలలో జాతీయ సేవా విభాగం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్తంగా జాతీయ సమైక్యత శిబిరం జరిగింది. ఈ శిబిరంలో దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి 200 మంది వలంటీర్లు పాల్గొన్నారు. పలు కార్యక్రమాలలో ఏఎన్యూ వలంటీర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని కళ్లకు కట్టినట్టు చూపారు. మిగిలిన రాష్ట్రాల వాలంటీర్ల కంటే నాగార్జున యూనివర్సిటీ వలంటీర్లు ప్రతిభ కనబరిచినట్లు మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను బుధవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ విభాగం అధికారులు అందజేసిన ధ్రువీకరణ పత్రాలను, షీల్డ్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య వి. దివ్య తేజ మూర్తి, జ్యోతిరావు పూలే డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావు, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ రామ చంద్రన్, పీజీ ప్రవేశాల విభాగం డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మాజీరావు, ఎన్ఎస్ఎస్ విభాగం సీనియర్ అసిస్టెంట్ కే. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం గుంటూరు సీపీఐ జిల్లా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రథమ నిర్మాణ మహాసభ ఘనంగా జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులేనని అన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. 15,000 మంది ప్రకృతి వ్యవసాయ ఉద్యోగస్తులకు కనీస వేతనం లేదని, పని భద్రత, ఉద్యోగ భద్రత లేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏ ఐ టీ యూ సీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, హనుమంతరావు అరుణ్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కార్యవర్గ ఎన్నిక

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ఎనుకున్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వెలుగురి రాధాకృష్ణమూర్తి, నూతన అధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రమేష్ బాబు, కోశాధికారిగా నాగేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులుగా వరప్రసాద్ (గుంటూరు), సునీల్ కుమార్ (కడప), రాహేల్‌రావు (బాపట్ల), విజయలక్ష్మి (ఎన్టీఆర్), సుధారాణి (బాపట్ల), సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసరావు (విజయనగరం), వీరరాఘవయ్య (తిరుపతి), శ్రీహరి (ప్రకాశం), రమాదేవి (నంద్యాల)తో పాటు 21 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రావులపల్లి రవీంద్రనాథ్, పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

నిర్దేశిత గడువులో వ్యాధినిరోధక టీకాలు వేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి శ్రావణ్‌బాబు

● జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి శ్రావణ్‌బాబు

పెదనందిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి శ్రావణ్‌బాబు అన్నారు. మండలంలోని అన్నపర్రు, నాగులపాడు గ్రామాల్లోని వైద్యఆరోగ్య కేంద్రాల వద్ద జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి మాట్లాడుతూ ఎన్‌సీడీ సర్వే మార్చి 30లోపు పూర్తిచేయాలని, గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది రక్తహీనత, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయినవారికి ప్రత్యేక చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని, సిబ్బంది విధుల్లో అలసత్వం వహించరాదని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ చెన్నయ్య, సిబ్బంది ఉన్నారు.

ఒక్క చాన్స్‌తో జగన్ అధ్యాయం ముగిసింది

● మళ్లీ సీఎం అవుతాడనేది భ్రమ
● 3000 సార్లు బెయిల్ తీసుకున్నాడు
● ఏ క్షణంలోనైనా జైలుకు పోవచ్చు
● కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్



మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణంతో వచ్చిన సానుభూతితో పాదయాత్ర ద్వారా ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను ప్రాధేయపడడంతో ప్రజలు చాన్స్ ఇచ్చారని, ఆ చాన్స్‌తోనే జగన్ రాజకీయ అధ్యాయం ముగిసిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా తో మాట్లాడారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ సీఎం అవుతానని జగన్ భ్రమ పడుతున్నారని విమర్శించారు. ఇప్పటివరకు మూడువేల సార్లు బెయిల్ తీసుకున్న జగన్ ఏ క్షణంలోనైనా జైలుకు పోవచ్చని అభిప్రాయపడ్డారు. బట్టలూడదీస్తానంటూ పోలీసు అధికారులను ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు భాష జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జగన్ పాలన దెబ్బ కు భయపడిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, నేడు కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోకుండా కోటీశ్వరుల పరమైందని విమర్శించారు. సీఆర్డీఏ పను ల్లో బడా కాంట్రాక్టర్లకే అవకాశాలు ఇస్తున్నారని, ఎస్సీ, ఓబీసీలకు కూడా కాంట్రాక్టు పను లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ బ్యాంకులు, దేశ సంపదలో వర్గీకరణ జరగాలన్నారు. 25 శాతం జనాభాగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకు అప్పుల్లో కేవలం ఒక్క శాతం, 50 శాతానికి పైగా వున్న బీసీలకు కేవలం 2 శాతం లోపు మాత్రమే రుణాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, బీజేపీ దేవుడ్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తుందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభు త్వం వెనుకబడిన ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ను సమానంగా అభివృద్ధి చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేయాలని మాజీమంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు.


భీమినేనివారి పాలెంలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు

ఇళ్ల స్థలాలను పరిశీలించిన ఆర్డీవో

మేడికొండూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి 167ఏజీ విస్తరణ కోసం భూసేకరణ క్రింద భీమినేనివారిపాలెంలో తీసుకున్న ఇళ్ల స్థలాలను గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. ఇళ్ళు, స్థలాలు కోల్పోతున్న వారు తమకు న్యాయం చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు ఆర్డీవో జాతీయ రహదారి భూసేకరణ కింద తీసుకుంటున్న స్థలాలను, ఇళ్లను ఆయన సందర్శించి సంబంధిత యాజమానులతో మాట్లాడారు. అంతేకాకుండా భీమినేనివారిపాలెంలో కొన్ని స్థలాలు ప్రభుత్వ స్థలాలుగా నమోదు కావడంతో రికార్డులను పరిశీలించి అర్హులైన వివరాలు నమోదు చేసుకున్నారు. కొంత మంది నష్టపరిహారం తక్కువగా వచ్చిందని, పునఃపరిశీలించాలని కోరారు. భూములను రీసర్వే చేయించాలని మరికొందరు గ్రామస్థులు అడిగారు. ఆర్డీవో వెంట రోడ్లు భవనాలశాఖ అధికారులు, తహసీల్దార్ హరిబాబు, సర్వేయర్లు, వీఆర్వోలున్నారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన


ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకటరత్నం

పెదనందిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లమడ వాగుపై ఉన్న కాకుమాను ఎత్తిపోతల పథకాన్ని నీటిపారుదల శాఖ ఎస్ఈ టీ వెంకటరత్నం బుధవారం పరిశీలించారు. పథకం ఎప్పుడు స్థాపించారు, పనితీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత పుసులూరు వద్ద కాలువలు పరిశీలించారు. తూముల్లో రెండు ఖానాలే ఉండడం వల్ల నీరు దిగువకు రావడం లేదని, అదనపు ఖానాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, టీడీపీ నాయకులు నల్లమోతు పూర్ణయ్య, డీసీ వైస్‌చైర్మన్ నువ్వుల సునీల్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతిచ్చి ప్రగతికి పట్టం కట్టండి

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి


చింతలపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

దుగ్గిరాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రగతికి పట్టం కట్టాలంటే తన విజయాన్ని తథ్యం చేయాలని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రులు, అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు. ఆలపాటి మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లోనూ అభివృద్ధి సాధనకు కృషిచేస్తున్న సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేసేందుకు తనను ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగులు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులు, ఎమ్మెల్సీ ఎన్నికపై ఆలోచించాలన్నారు. బీజేపీ రాష్ట్రఅధికార ప్రతినిధి జయప్రకాశ్‌నారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోగా, వారిస్థాయిని దిగజార్చిందన్నారు. చందు రామారావు, కరస్పాండెంట్ వి జయలక్ష్మి, కేసంనేని శ్రీఅనిత, టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావు, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య, ఉన్నం ఝాన్సీరాణి, వల్లూరు నరసింహారావు, పాటిబండ్ల కృష్ణప్రసాద్, యేళ్ల జయలక్ష్మి, కొరిటాల సురేష్ పాల్గొన్నారు.

● నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న కూటమి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. ఆలపాటి గెలుపు కోరుతూ మండలంలోని ఈమనిలో ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని బ్యాంకులు, పోస్టాఫీసులు, పలు కార్యాలయాల్లో పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. తెలుగుయువత ఉపాధ్యక్షుడు మన్నవ అశోక్, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, సర్పంచ్ సిద్దెల శ్రీవాణి ఉజ్వలహరిణి, ఎంపీటీసీ గ్యారా నిర్మల పాల్గొన్నారు.

మహిళా సాధికారతే యూనియన్ బ్యాంకు లక్ష్యం

● యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్


మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే యూనియన్ బ్యాంకు లక్ష్యమని బ్యాంకు రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్ అన్నారు. మండలపరిధిలోని పుల్లడిగుంట యూనియన్ బ్యాంకు వద్ద బుధవారం డ్వాక్రా రుణాలపై మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.20లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపునకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


మాట్లాడుతున్న రామాంజనేయులు, పాల్గొన్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు తొలి ప్రాధాన్య ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక అరండల్‌పేట జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం గుంటూరు రూరల్ మండల ముఖ్యనాయకుల సమావేశం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రిగా సేవలందించిన ఆలపాటి పట్టభద్రుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, మండలిలో ఆయన సేవలు అవసరమన్నారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, కొర్రపాటి నాగేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, ఇమ్మడి మల్లికార్జునరావు, పంచుమర్తి శేషు, కల్లూరి అవినాష్, కార్పొరేటర్లు నూకవరపు బాలాజీ, స్మితా పద్మజా పాల్గొన్నారు.

మెజారిటీయే లక్ష్యంగా పనిచేయాలి

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆలపాటికి మెజారిటీయే లక్ష్యంగా పనిచేయాలని కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే రామాంజనేయులు పిలుపునిచ్చారు. వట్టిచెరుకూరులో బుధవారం ఆలపాటికి మద్దతుగా కూటమి మండల నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఎన్నికల పరిశీ లకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కుర్రా ధనుంజయ్, మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణ చంద్రరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పత్తి భావన్నారాయణ, జిల్లా సెక్రటరీ త్రినాథ్, టీడీపీ సీనియర్ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, నాగిశెట్టి నాగరాజు పాల్గొన్నారు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంఅభివృద్ధి సాధిస్తుందని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలని కోరుతూ బుధవారం లక్ష్మీనరసింహస్వామి కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్త తమ్మిశెట్టి జానకీదేవి, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధానకార్యదదర్శి షేక్ రియాజ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్: తాడేపల్లి పట్టణం 8వ వార్డులో ఆలపాటికి మద్దతుగా టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కంచర్ల శివప్రసాదరావు, కొర్రపాటి రమణ, విజయకుమార్, బెజ్జం బాబూరావు, అక్కల చెన్నయ్య, రమణ ఓబుల్‌కుమార్ పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా మండల నేతలు మండలపరిధిలోప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ఎన్నో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, దీనికనుగుణంగా ఉద్యోగులు, పట్టభద్రులు అంతా ఆలపాటికి ఓటు వేయాలని తెలిపారు. మండల జనసేన అధ్యక్ష కార్యదర్శులు ఆముదాలపల్లి నరేంద్ర, వల్లంశెట్టి లలిత్, నాయకులు పోపూరి లక్ష్మీనారాయణ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ద్వారా డ్వాక్రా సంఘాల ఆర్థికాభివృద్ధి

ఫిరంగిపురం ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా డ్వాక్రా సంఘాలు ఆర్థిక పురోభివృద్ధిని సాధించాలని యూనియన్ బ్యాంకు నోడల్ అధికారి పీలా రవి అన్నారు. బుధవారం ఫిరంగిపురంలోని యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో డ్వాక్రాసంఘాల రుణమేళా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సభ్యులందరూ బ్యాంకు భాగస్వామ్యంతో తీసుకునే రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా సంఘాలు పొదుపు పెంచుకోవాలని సూచించారు. బ్రాంచ్ మేనేజర్ రాధిక మాట్లాడుతూ క్యాష్ క్రెడిట్ రుణాలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీఎం వి.నాగేశ్వరరావు. సీసీ ఆదిలక్ష్మి ఆర్డీవో కవిప్రియ పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి శోభాయాత్ర

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మరాఠా సామ్రాజ్యవీరుడు ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. గౌతమబుద్ధ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర అంబేడ్కర్ సెంటరు, బంగ్లా, దేవస్థానం, పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల వరకు సాగింది. కార్యక్రమంలో బీజేపీ, హిందూసంఘాల ప్రతినిధులు తుల్లిమిల్లి రామకృష్ణ, దామర్ల నాగేశ్వరరావు, పంచుమర్తి ప్రసాద్, మునగపాటి వెంకటేశ్వరరావు, జగ్గారపు శ్రీనివాసరావు, పడమట రాధాకృష్ణ, కాండ్రు భానుకిశోర్ పాల్గొన్నారు.

పథకాలు అందేలా చర్యలు తీసుకోండి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కార్యాలయంలో దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామస్థులు బుధవారం చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని కలిశారు. మాదిగ కార్పొరేషన్‌కు సంబంధించిన సబ్సిడీ లోన్లు, ప్రభుత్వం అందించబోయే పథకాల గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లి తొందరగా అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తానని ఎవరూ ఇబ్బందిపడాల్సిన అవసరంలేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ, నలుకుర్తి కోటేశ్వరరావు, కసుకుర్తి నవీన్, కె.శేఖర్, చిలువూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న వెంకటరెడ్డి తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని వడ్డేశ్వరంలో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కేవీపీఎస్ నాయకులు నాగపోగు విజయరాజు, కౌలురైతు సంఘం నాయకులు గుడిసె శ్రీనివాసరావు, గుడిసె ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి: కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పాతమంగళగిరి, చినపంజా వీధి, కోనేరు సెంటరు, 12, 13 వార్డుల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నేతలు జేవీ రాఘవులు, బాలకృష్ణ, కమలాకర్, బాలాజీ, చలపతిరావు, కోటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ట్రిపుల్‌ఈ కార్యశాల ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జి వీసీ రాజశేఖరరావు

తాడేపల్లి(వడ్డేశ్వరం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్యశాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. డీఎస్‌టీ ఎస్‌ఆర్‌ఎఫ్ కేఎల్‌యూ, సంయుక్తంగా ప్రాయోజిత అంతర్జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నట్టు ట్రిపుల్ ఈ విభాగాధిపతి ఆర్‌టీ ఆర్ ప్రకాష్ తెలిపారు. పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ నెక్స్ట్ జనరేషన్స్ ఎనర్జీ అండ్ ఎలక్ట్రికల్ వెహికల్ సొల్యూషన్స్ చాలెంజెస్, హాండ్ ఆన్ అప్లికేషన్స్ అనే అంశంపై టెక్నికల్ సదస్సును ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యశాలలో పునరుత్పాదక శక్తి మార్పిడి, ఎలక్ట్రికల్ వెహికల్ డ్రైవ్, చార్జింగ్ టెక్నాలజీలపైన వక్తలు ప్రసంగించారు. కార్యశాలకు సామ్రాజ్ సోలార్ ఇండస్ట్రీస్ సీఈవో ఏ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా, గౌరవఅతిథిగా వి శివనాగేశ్వరరావు, ప్రోవీసీ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కె సుబ్బారావు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి ప్రకాష్, కార్యశాల కో ఆర్డినేటర్ ఎం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఆర్‌ఎం రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో బుధవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. గుంటూరుకు చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యుల బృందం ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్‌కుమార్ కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి ఆప్తమాలిస్ట్ డాక్టర్ శ్రావణి తమ సిబ్బందితో కలిసి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 419మందికి వైద్యసేవలు, సలహాలు అందించారు. ఈ కార్యక్ర మంలో ఎస్‌ఆర్‌ఎం డైరెక్టర్లు అనిల్ నిగమ్, అనూప్ సింగ్ సూర్యవంశీ, రేవతి బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న సన్నిధికి పచ్చళ్ల తరలింపు

మంగళగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామి సన్నిధిలోని అన్నదాన కేంద్రానికి మంగళగిరి నుంచి దాతలు ఊరగాయ పచ్చళ్లను పంపించారు. 2.4 టన్నుల ఐదు రకాల పచ్చళ్లను దాత రాము ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వాహనంపై శ్రీశైలం తరలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, అనిత, ఆలూరి లోకేశ్వరరావు, బొప్పన రాఘవయ్య, కోట సురేష్, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఫిరంగిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని దీనాపూర్ క్యాంపస్‌లో కార్ఫ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పుల్లగూర రంజన్‌బాబు 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సెయింట్ జేవీఆర్ ఫార్మసీ కళాశాల, ఆర్‌సీజేసీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. శిబిరంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ జీనస్ మణిబాబు, ఎండీ సుదర్శన్, కార్ఫ్ సంస్థ జేడీ పుష్పలత, అనిత, ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం


యూపీహెచ్‌సీ సిబ్బందితో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం

మంగళగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం బుధవారం మంగళగిరి గణపతి నగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. బ్యాంకు కన్సల్టెంట్ గణేష్, మొహిర్ అహ్మదేవ్‌లతో కూడిన బృందం యూపీహెచ్‌సీలోని ఓపీ, ఈహెచ్‌ఆర్, నేషనల్ ప్రోగ్రామ్స్ అమలు, ఎన్కాస్ స్టాండర్స్ తదితర అంశాలను గురించి తెలుసుకున్నారు. స్టేట్ క్వాలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు యూపీహెచ్‌సీలో నాణ్యతా ప్రమాణాలు, సిబ్బంది పని తీరును పరిశీలించారని చెప్పారు. భవిష్యత్తులో వరల్డ్‌బ్యాంకు సహాయం చేయాలని భావిస్తుందని, ఆ అంశాలపై కూడా చర్చించారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్స్ డాక్టర్ నరేంద్ర వాసు, వేణు, డాక్టర్ పీ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సాల్ట్ శిక్షణ

ఫిరంగిపురంలోని అంగన్‌వాడీలకు మొదటి బ్యాచ్ ఈనెల 18వ తేదీ నుంచి 20వరకు, రెండో బ్యాచ్ ఈనెల 22 నుంచి 25వరకు సాల్ట్ శిక్షణ సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నామని సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం ఫిరంగిపురంలోని అల్లంవారిపాలెం జడ్పీ హైస్కూల్లో 30 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల ఆఫ్‌లైన్ శిక్షణ ఇస్తున్నామన్నారు. బాల్య సంరక్షణ, ఈసీసీఈ కార్యక్రమాలు అమలుచేయటానికి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో సీడీపీవో పీజీసీ ప్రసూన, డీఆర్‌పీలుగా సురేష్‌బాబు పాల్గొన్నారు.

సరికొత్త విధానం కనిపెట్టిన సాహితి

గ్లియోబ్లస్టోమా నివారణలో

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కొన్ని ఔషధాల కొత్త కలయిక ద్వారా గ్లియోబ్లాస్టోమా మల్టీఫార్మ్ (జీబీఎం)ను అదుపులో ఉంచడం ద్వారా ప్రాణాంతకమైన మెదడు క్యాన్సర్‌ను నివారించడానికి సులువైన మార్గాన్ని కనిపెట్టినట్టు కే ఎల్ డీమ్డ్ యూనివర్సిటి బయోటెక్నాలజీలోని పరిశోధనా విద్యార్థిని సాహితీ ఆర్ చామ తెలిపారు. తన మార్గదర్శి అయిన బ యోటెక్నాలజీ ఆచార్యులు డాక్టర్ ఎం జానకీరామయ్య నేతృత్వం లోని పరిశోధనలు రెండు కీలకమైన జీవక్రియ మార్గాలైన హెచ్‌డీఏసీ, జీఎల్‌యూటీ ఇన్‌హిబిటర్‌లను ఉపయోగించడం ద్వారా గణనీయంగా ఫలితాలను మెరుగుపరుస్తాయని సూచించాయన్నారు. జీబీఎం నాలుగో గ్రేడ్ క్యాన్సర్ సాధారణంగా రోగ నిర్ధారణ తర్వాత 13నుంచి 15 నెలల మధ్య సమయంలో భయంకరమైన రోగ నిరూపణను కలిగి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఏహెచ్ డీఏ, టుబాస్టెటాయిన్ వంటి హెచ్ డీఏసీ ఇన్హిబిటర్లు కొన్ని (జీబీఎం) సెల్ లైన్లలో వాగ్దానాన్ని చూపించినప్పటికి, అన్ని సెల్ లైన్లు సమానంగా స్పందించవని డాక్టర్ జానకిరామయ్య తన పరిశోధనలో నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ డాక్టర్ రాజశేఖరరావు, ప్రోవీసీ డాక్టర్ ప్ర సాద్, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్ డాక్టర్ ప్రసాద్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి ప్రవీణ్, తదితరులు పాల్గొని విద్యార్థిని సాహితిని అభినందించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు

మేడికొండూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అధికారులు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులకు సహకరించడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు బుధవారం పేరేచర్లకు వచ్చిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో జరిగే పనులను సరిగా పట్టించుకోవడం లేదన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేసిన పనులకు కొర్రీలు వేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టర్‌లు చేతులెత్తేసే పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యేని కలసిన వారిలో మాజీ జడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, దండా సాంబిరెడ్డి ఉన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 56, రేపల్లె కాల్వకు 163, తూర్పుకాల్వకు 176, పశ్చిమ కాల్వకు 70, నిజాంపట్నం కాల్వకు 55, కొమ్మమూరు కాల్వకు 855 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

119 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఫిబ్రవరి 19: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన వేలం లో 119 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,200 గరిష్ఠధర రూ.11,000 మోడల్‌ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,200, గరిష్ఠధర రూ.11,000 మోడల్‌ధర రూ.11,000 పలికాయి.

విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలి

కాకుమాను, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలని సీడీపీవో సుజాతదేవి అన్నారు. కాకుమాను జడ్పీ హైస్కూల్లో బుధవారం అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో కెన్నడీ, ఏసీడీపీవో విజయనిర్మల, ఎంఈవో-2 విజయ్‌భాస్కరరావు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మెజార్టీకి ఆలపాటి గెలుపు అవశ్యం

ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విధాన సభలో కూటమి అభ్యర్థుల మెజార్టీ కోసం ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు గెలుపు ఆవశ్యమని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఫిరంగిపురంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో ఆలపాటి గెలుపుపై జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సభలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు, మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామిలు ఆలపాటిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తాడికొండ జనసేన ఇన్‌చార్జ్ బీ విజయశేఖర్, బీజేపీ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, కె.రామకోటేశ్వరరావు, సయ్యద్ రబ్బానీ, పి.రత్నరాజు, హరినాథరెడ్డి, గోవిందయ్య, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో ముగ్గురి అరెస్టు

దుగ్గిరాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న కేసులో ముగ్గురు నిందితులను దుగ్గిరాల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నాలుగు రోజుల క్రితం పెదపాలెంలో కిలో 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న కేసులో ఆరుగురిపై కేసు నమోదు ముగ్గురిని అరెస్టుచేసిన విషయం విదితమే. కాగా మిగిలిన ముగ్గురు నిందితుల్లో చిలువూరుకు చెందిన షేక్ మహ్మద్‌గౌస్, తాడేపల్లికి చెం దిన మల్లవరపు పృథ్వీ, కన్యకాపురం గోపి వడ్లపూడికి చెందిన అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకటరవి తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారి షేక్ రబ్బానిని హత్యచేసిన కేసులో గౌస్‌బాషాను అరెస్టు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం నిందితుడిని విలేక రుల ముందు హాజరుపరిచి కేసు వివరాలను సీఐ రమేష్‌బాబు తెలిపారు. చినరావూరు తోటలోని శ్మశానం బజారులో నివాసముంటున్న షేక్ రబ్బాని పండ్ల వ్యాపారి. అతడి పెద్ద అక్క కుమార్తె సనాకు తెనాలి పినపాడుకు చెందిన షేక్ గౌస్ బాషాతో సుమారు 13 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్నారు. గౌస్‌బాషా చెడువ్యసనాలకు బానిసై భార్యను పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని చిత్రహింసలకు గురిచేస్తుండటంతో ఆమె మూడు నెలల క్రితం పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చేసింది. దీనిపై భార్యను కాపురానికి పంపాలంటూ అత్తగారింటికి గౌస్‌బాషా వచ్చి కోరగా మేనమామ వ్యసనాలు మానుకోవాలని హితవు పలకటంతో ఘర్షణ పడి వెళ్లిపోయాడు. గౌస్‌బాషా ఆదివారం చెంచుపేటలో పండ్లు అమ్ముకుంటున్న రబ్బానిని కత్తితో పొడిచాడు. రబ్బాని తెనాలి వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుని అన్న షేక్ చాన్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితుని బుధవారం అరెస్టుచేసి కోర్టు ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన సంఘటనపై పొన్నూరు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన జిడుగు నాగేశ్వరరావు (92) అనే వృద్ధుడు ఈ నెల 11న పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో నాగేశ్వరరావును గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. నాగేశ్వరరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మంగళవారం రూరల్ పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రారంభమైన సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వారంలో మూడు రోజులు నిర్వహిస్తున్న సదరం సర్టిఫికేట్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఈ శిబిరానికి సుమారు 100మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వైద్యశాల వర్గాలు తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి నిత్యావసరాలను అందించడం అభినందనీయమని జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో 100 మంది హెచ్ఐవీ బాధితులకు, మరో 20 మంది లెప్రసీ రోగులకు సర్వేట్రస్ట్ సహకారంతో నిత్యవసరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ముఖ్య అతిథిగా హాజరై వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్వే ట్రస్ట్ డైరెక్టర్ లావణ్య, ఆర్ఎంవో డాక్టర్ మల్లికార్జునరావు, ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అంకినీడు ప్రసాద్, ట్రస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ శాంతిఆశిక, ఏఆర్‌టీ వైద్యులు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహశ్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుప్తా కళాశాలలో రక్తదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో బుధవారం 100మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో విజయ్‌కృష్ణ, రెడ్‌క్రాస్ కార్యదర్శి భానుమతి, భాస్కరరావు, డాక్టర్ పవని ప్రియాంక, అధ్యాపకులు దశరధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి పాటుపడాలి: రాజశేఖరరెడ్డి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19: అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల సమగ్రాభివృద్ధికి పాటు పడాలని ట్రైనింగ్ ప్రోగామ్ రాష్ట్ర పరిశీలకులు కే.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేతాజీ నగర్ హైస్కూల్‌లో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు జరిగాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు నైపుణ్యాలను పెంపొందించుకోవడం, చిన్నారులను పాఠశాలలకు సంసిద్ధం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆర్ చలపతిరావు, శ్రీనివాసరెడ్డి, మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల సంరక్షణ కీలకం: ఎంఈవో

కొల్లిపర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సంరక్షణ ఎంతో కీలకమైందని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై ఐసీడీఎస్ అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా ప్రాథమిక విద్య మరింత బలోపేతం అవటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యామిని, రాధిక, ఆర్‌పీలు మృత్యుంజయరావు, రాధిక, శ్రీలత, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

119 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఫిబ్రవరి 19: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 119 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,200 గరిష్ఠధర రూ.11,000 మోడల్‌ధర రూ.11,000 పలికాయి.

ఊపందుకున్న కంద తవ్వకాలు

● ఆశాజనకంగా ధర, దిగుబడులు
● ఈ ఏడాది ధరలతో రైతుల్లో ఆనందం



కందను తవ్వితీసి లారీల్లో ఎక్కించేందుకు తీసుకువెళుతున్న కూలీలు

కొల్లిపర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతంలో కంద సాగు చేపట్టిన రైతుల ఇంట సిరులు కురుపిస్తోంది. కందలో ఆశించిన దిగుబడులు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కంద సాగు చేసే సమయానికి మంచి ధర ఉండటంతో ఎక్కువమంది రైతులు సాగుచేశారు. ఈ సంవత్సరం కూడా అధిక దిగుబడులు, ధర వస్తుందని ఆశతో కంద సాగుచేసిన రైతులు ఎన్నో ఆశలు పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెగుళ్ళు, చీడపీడలు ఆశించకుండా వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు మందులను పిచికారీ చేసి తగిన ఎరువులను అందించారు. ఆరు నెలల కాల పరిమితి గల ఈ పంట డిసెంబర్ నెలాఖరుకు కంద తవ్వాల్సి ఉంది. అయితే డిసెంబరులో రూ.10వేల నుంచి రూ.12వేలు వరకు పలికిన కంద ధర అనూహ్యంగా జనవరి నుంచి 15వేల వరకు చేరుకుంది. 20 రోజుల నుంచి కంద ధర రోజుకు, రోజుకు పెరుగుతోంది. కంద ధర పుట్టీ ఒక్కసారిగా రూ.15 వేల 500 చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కందకు తగిన ధర ఉండటంతో రైతులు తవ్వకాలు ముమ్మరం చేశారు. కందలో రైతులు ఆశించిన దిగుబడులు రావడంతో రైతుల మోములు కళకళలాడుతున్నాయి. డెల్టా ప్రాంతంలో ఈ సంవత్సరం 400 ఎకరాల్లో రైతులు కందను సాగు చేయగా కొల్లిపర మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పాతబొమ్మువానిపాలెం, పిడపర్తిపాలెం, గుడిబండివారిపాలెం, కొల్లిపర, తూములూరు, దావులూరుపాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరం, అన్నవరంగౌడపాలెం, అన్నవరం లంక గ్రామాల్లో రైతులు 180 ఎకరాల్లో కంద సాగు చేశారు. తెగుళ్ళసోకటంటోపాటు వరదలకు కొంత మేర దెబ్బతిన్న మిగిలిన పొలాల్లో 65 నుంచి 80పుట్ల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి కౌలుతో కలిపి ఖర్చు 3లక్షల రూపాయల వరకు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఖర్చులు పోను ప్రస్తుతం ఉన్న ధర, దిగుబడులు బట్టి ఎకరానికి 3లక్షల రూపాయల వరకు లాభాలు రావచ్చునని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం.. ఆలపాటిని గెలపించుకుందాం...

● మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, వేదికపై కూటమి నాయకులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి శ్రేణులందరం కలిసికట్టుగా పనిచేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ పార్టీ కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్, బీజేపీ నాయకుడు వల్లూరి జయప్రకాష్‌రావు, జనసేన నాయకులు చందు సాంబశివరావు, జనసేన పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాయబ్‌కమల్, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరిముల్లా పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలపై కలిసికట్టుగా పోరాడామని అందరి పోరాట ఫలితంగానే నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ తండ్రి చనిపోగానే పదవుల కోసం ఆరాటపడే పార్టీ దేశ రాజకీయాల్లో వైసీపీకే దక్కిందని విమర్శించారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం ఒక్కటైన పార్టీలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ అన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందురోజు మహాశివరాత్రి జాగారం ఉంటుందన్నారు. మరుసటి రోజు ఎన్నికలు జరుగుతాయని పట్టభద్రులను మేల్కొల్పే బాధ్యత కూటమి శ్రేణులందరూ తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు వల్లూరి జయప్రకాష్‌రావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి మరో చాన్స్ లేకుండా అవినీతి అక్రమాలకు నెలువుగా మారిందని ఆరోపించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ ప్రజల మనిషిగానే ఉంటూ వారి మధ్యనే గడిపానన్నారు. జగన్ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో అవన్నీ మర్చిపోవడం సరికాదన్నారు. జనసేన నాయకుడు చందు సాంబశివరావు, జనసేన పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాయబ్ కమల్, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరిముల్లా పలువురు నాయకులు తమ ప్రసంగంలో ఆలపాటి గెలుపుకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ఆదోని ఎమ్మెల్సీ తెనాలి ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బీటీ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో పెద్దసంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

జగన్ కుట్రలు ప్రజలు నమ్మరు: దేవినేని

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 19: జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు విశ్వసించబోయేది లేదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలో బుధవారం మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా నిధులు ఇవ్వలేని జగన్ రైతుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

● కొల్లిపర: జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు తదితర గ్రామాల్లో ఆలపాటి గెలుపు కోసం టీడీపీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘ ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, అవుతు సంజీవరెడ్డి, కొల్లి కోటిరెడ్డి , బొంతు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: కృష్ణా, గుంటూరు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావి కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. బుధవారం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని 28, 29 వార్డుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రేపల్లె సుబాని, ఈదర శ్రీనివాస్, పల్లపాటి విజయ్, చంద్రం, మనోహర్, రాజా పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం కోరుతూ పట్టణంలోని బ్యాంకుల్లో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. నాయకులు ఈదర వెంకట పూర్ణచంద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి



వల్లభాపురం సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్లను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సెంటర్లలో ఆధార్‌లో ఏ విధమైన తప్పులు ఉన్నా, అడ్రస్సు మారినా సరిచేయించుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా ఆధార్ సెంటర్లను సచివాలయాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

యూరియాను అధికంగా వినియోగించవద్దు

● ఏవో డేగల వెంకట్రామయ్య

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరులో యూరియా అధిక మోతాదులో వినియోగించడం వలన పంట భూములు చౌడు భూములు అవుతున్నాయని ఏవో డేగల వెంకట్రామయ్య అన్నారు. మండల పరిధిలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పంట భూములలో యూరియా అధిక మోతాదులో వినియోగించడం వలన కలిగే నష్టాలను రైతులకు వివరించారు. భూమి చౌడు బారడం, పంటలను చీడపీడలు ఆశించడం వంటి అనర్థాలు జరుగుతాయని హెచ్చరించారు. అపరాల పంటలలో గ్రోత్ ప్రమోటర్స్ వాడకం తగ్గించి మల్టీకే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ సభ్యులు బండ్లమూడి బాబూరావు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని బుధవారం శ్రీ రామా మున్సిపల్ హైస్కూల్‌లో ఘనంగా జరిపారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాజర్‌బాబు, రెడ్డి వెంకటేష్, అధ్యాపకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలి: రమాదేవి

రేపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో హక్కుల కోసం కేఎస్ లక్ష్మణరావు నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. బుధవారం ప్రభుత్వ కార్యాలయం, కోర్టు ప్రాంగణంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావు గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శాసనమండలిలో పట్టభద్రుల ఉపాధ్యాయుల కోసం కేటాయించిన స్థానాల్లో వారికి ప్రాతినిధ్యం ఇస్తేనే ప్రజల హక్కులు కాపాడతాయని అన్నారు. కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, జైభీమ్ భారత్ పార్టీ ఇన్‌చార్జ్ రమేష్‌రాంజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, బీఎల్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

ఒక్క చాన్స్‌తో జగన్ అధ్యాయం ముగిసింది

● కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణంతో వచ్చిన సానుభూతితో పాదయాత్రలో ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను ప్రాధేయపడడంతో ప్రజలు చాన్స్ ఇచ్చారని, ఆ చాన్స్‌తోనే జగన్ రాజకీయ అధ్యాయం ముగిసిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ సీఎం అవుతానని జగన్ భ్రమ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు మూడువేలసార్లు బెయిల్ తీసుకున్న జగన్ ఏ క్షణంలోనైనా జైలుకు పోవచ్చున్నారు. బట్టలూడదీస్తానంటూ పోలీసు అధికారులనుద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు భాష జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జగన్ పాలన దెబ్బకు భయపడిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, నేడు కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోకుండా కోటీశ్వరుల పరమైందని విమర్శించారు. సీఆర్డీఏ పనుల్లో బడా కాంట్రాక్టర్లకే అవకాశాలు ఇస్తున్నారని, ఎస్సీ, ఓబీసీలకు కూడా కాంట్రాక్టు పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 25 శాతం జనాభాగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకు అప్పుల్లో కేవలం ఒక్క శాతం, 50 శాతానికి పైగా వున్న బీసీలకు కేవలం 2 శాతం లోపు మాత్రమే రుణాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, బీజేపీ దేవుణ్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తుందని ధ్వజమెత్తారు.



నరసింహారావు దంపతుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

నరసింహారావుకు ఘన నివాళి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయ ధర్మకర్తగా ఆలయ అభివృద్ధికి, బీసీ సంఘ అభివృద్ధికి కృషిచేసిన తుళ్లూరు నరసింహారావు చిరస్మరణీయుడని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకులు కేసన శంకరావు అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద గల బాలాజీ గార్డెన్‌లో బుధవారం తుళ్లూరు నరసింహారావు 39వ వర్ధంతి, వారి సతీమణి ఆదిలక్ష్మమ్మ 17వ వర్ధంతిని తుళ్లూరు నరసింహారావు అన్నదాన ట్రస్ట్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మురికిపూడి నరసింహారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిలుగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకులు కేసన శంకరావు, రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షుడు వాకా రాంగోపాల్ గౌడ్ పాల్గొన్నారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లక్కరాజు లక్ష్మణరావు, కంచర్ల కావయ్య గౌడ్, తాత సాంబశివరావు గౌడ్, కుటుంబ సభ్యులు జగన్, ఉదయ్, మాధవ్, వివేక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ షైనీ

మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎంజే మహిళ కళాశాలలో బుధవారం హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళా విభాగానికి సంబంధించి పోటీలను ప్రిన్సిపాల్ షైనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడల్లో ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. మొదటి మ్యాచ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళ కళాశాల గుంటూరు తలపడగా, బాపట్ల కళాశాల 8-3 స్కోర్‌తో విజయం సాధించింది. అధ్యాపకులు అరుణ సుజాత, ప్రేమ్‌కుమార్, సుశీలమ్మ, వేళాంగిణి పర్యవేక్షించారు.

చెత్త నుంచి వర్మీ కంపోస్టుతో సంపద సృష్టి

ఎంపీడీవో ఉమాదేవి



వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను వర్మీ కంపోస్టుగా తయారు చేయడంతో చెత్తను నివారించడమే కాకుండా సంపద సృష్టించుకోవచ్చని ఎంపీడీవో ఏ ఉమాదేవి అన్నారు. చేబ్రోలు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద బుధవారం జిల్లాలోని 16 మండలాల అధికారులకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా చేబ్రోలులో అమలు చేస్తున్న చెత్త వేరుచేసే విధానం వర్మీ కంపోస్టు తయారీపై ఎంపీడీవో ఉమాదేవి అవగాహన కల్పించారు. డీపీఆర్సీ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.పద్మారాణి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను మూడు బుట్టల ద్వారా సేకరించి తడిచెత్త, పొడి చెత్త, హానికారకమైన చెత్తగా వేరు చేయాలన్నారు. తడి చెత్తను వానపాముల ఎరువుగానూ, పొడి చెత్తను వేరుగా విక్రయించుకోవచ్చని సూచించారు. హానికారక చెత్తను వేరు చేసి చెత్త సేకరణ కేంద్రాలకు పంపాలని సూచించారు. నాడుపు తొట్టెలలో వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని 16 మండలాలు ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛ భారత్ మిషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భూముల రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి: తహసీల్దార్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో బుధవారం వ్యవసాయ భూములలో జరుగుతున్న రీ సర్వేను తహసీల్దార్ తనిఖీచేశారు. రీసర్వే జరుగుతున్న తీరు రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఆర్‌వీఐటీలో ఓటరు అవగాహన సదస్సు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 19: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వినియోగించుకోవాలని నోడల్ ఆఫీసర్ దుర్గాబాయి అన్నారు. చేబ్రోలు ఆర్‌వీ ఐటీ కళాశాలలో బుధవారం ఎమ్మెల్సీ ఓటర్ల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గాబాయి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటు హక్కు ఆవశ్యకతను తెలియజేశారు. ఎమ్మెల్సీ ఓటు వినియోగించుకోవడంపై పలు సూచనలు చేశారు. ఈ నెల 27న జరిగే ఓటింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసశర్మ, డీటీ శ్రీనివాస్, కళాశాల అధ్యక్షుడు ఆర్ వంశీ కృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.